
Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 28.06.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 04 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com



# విజయభారం ఆమెదే!

• తెలంగాణలో మొదలైన వైకాపా హవా • విజయమ్మ పర్యటనతో మారుతున్న రాజకీయ చిత్రం

**రాజకీయాలంటే పూలపాన్పు కాదు... ముళ్లబాట. రాజకీయాలంటే పాలసముద్రం కాదు... బురదమడుగు. రాజకీయాలంటే పన్నీటి సువాసన కాదు... పందులు పొర్లాడే రొచ్చు గబ్బు. ప్రత్యేకించి మన దేశ రాజకీయ వాతావరణమిది.**

ఇలాంటి చెత్త రాజకీయాలలో నెగ్గుకురావడం మహామహులవల్లే సాధ్యం కాదు. 'మగధీర'లాంటి నాయకులు కూడా ఈ గబ్బు రాజకీయాల దెబ్బకు వెల్లకిలా పడిన సందర్భాలెన్నో వున్నాయి. పుట్టుకతోనే రాజకీయంగా ఓనమాలు ఔపోసనపట్టినవారికి కూడా ఈ రాజకీయాలు ఒక పట్టాన అర్థం కావు. ఇలాంటి రాజకీయ చదరంగంలో కూడా ధైర్యం వీడక, నిస్పృహను దరిచేరనీయక ధైర్యంగా ముందడుగు వేస్తుంది వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ గౌరవాధ్యక్షురాలు శ్రీమతి వై.యస్.విజయమ్మ.

తాను రాజకీయాలలోకి రావాల్సి వుంటుందని, ఇంటి గడప దాటి ప్రజల్లోకి రావాల్సి వస్తుందని, ప్రజాప్రతినిధిగా ఎన్నికలలో పోటీ చేయాల్సి వస్తుందని, రాష్ట్రమంతటా ప్రచారానికి తిరగాల్సి వస్తుందని ఆమె కలలో కూడా అనుకోలేదు. అనుకోలేదని ఆగవుగా అన్నీ... అదే జరిగింది ఆమె జీవితంలో. భర్త వై.యస్. మరణం ఆమె జీవితంలో కోలుకోలేని కుదుపు అయితే... ఆ తర్వాత జరిగిన పరిణామాలన్నీ కూడా మానసికంగా ఎన్నో గాయాలను చేసాయి. తన భర్త ఏ కాంగ్రెస్‌పార్టీ కోసమైతే జీవితాంతం కష్టపడ్డాడో. అదే కాంగ్రెస్ అధిష్టానం తమపై పగబట్టడం, పార్టీకి దూరం చేయడం, జగన్‌ను జైల్లో పెట్టడం... ఈ పరిణామాలన్నింటిని తట్టుకుని విజయమ్మ నిలబడగలిగిందంటే అది తన భర్త వై.యస్. నుండి పుణికి పుచ్చుకున్న గుణమే. కొడుకు ఏడాదికిపైగా జైలులో వుంటే ఇంకెవరన్నా అయ్యుంటే వెళ్లి సోనియాగాంధీ కాళ్ల మీద పడి నా బిడ్డను కాపాడమని అడిగేవాళ్లు. విజయమ్మ ఆ పని చేయలేదు... చేయదు కూడా! వారి రక్తంలోనే ఆ లక్షణం లేదు. బిడ్డ జైలులో వున్నాడు కదా అని చెప్పి ఆమె మానసికంగా కుంగిపోలేదూ... ఇంటికీ పరిమితం కాలేదు. జగన్ జైలులో వున్నా అతనిని నమ్మిన ప్రజలకు, అతని నాయకత్వాన్ని కోరుతున్న కేడర్‌కు అండగా నిలవాలనే తపనతో ఆమె (మిగతా 5వ పేజీలో)

# వరదల్లో ఓట్ల వేట




తెలుగు పరువు తీసారు

**ఇళ్లు కాలి ఒకడేడుస్తుంటే చుట్ట కాల్చుకోవడానికి నిప్పు దొరికిందని సంబరపడ్డాడంట మరొకడు. ఇలా తగలబడింది మన రాష్ట్ర రాజకీయ నాయకుల వ్యవహారం.**

ఉత్తరాఖండ్‌లో సంభవించిన వరదలకు చార్‌ధామ్ యాత్రకు వెళ్లిన భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ వరదల్లో వేలమంది చనిపోగా, బ్రతుకుజీవుడా అంటూ ప్రాణాలతో బయటపడ్డవాళ్లు తమను గమ్యస్థానం చేర్చే ఆపన్న హస్తం కోసం ఎదురుచూసారు. చార్‌ధామ్ యాత్రకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుండి యాత్రికులు వెళుతుంటారు. బయట ప్రదేశాల యాత్రలకు వెళ్లడంలో తెలుగు ప్రజలు కాస్త ముందుంటారు. శబరిమలైకు వెళ్లే వారిలోనైనా, షిర్డికి వెళ్లే (మిగతా 5వ పేజీలో)


# కోట్లుంటేనే సీట్లు

## అభ్యర్థుల కోసం అగచాట్లు



కోట్లు... ఓట్లు... సీట్లు... తెలుగుదేశం అధినేత చంద్రబాబు ముందున్న పెద్ద చిక్కుప్రశ్న ఇది. కేవలం సినిమాగ్లామర్‌తో పుట్టి, రాష్ట్ర రాజకీయాలలో పెనుతుఫాన్‌లు సృష్టించిన తెలుగుదేశం పార్టీకి కూడా ఈరోజు డబ్బు రాజకీయాలు అవసరమయ్యాయి. గ్లామర్‌ను చూసి ఓట్లేయడానికి ఇప్పుడా పార్టీలో ఎన్టీఆర్ లేడుగా! పదేళ్లుగా అధికారానికి దూరమై, పదవీకాంక్షతో ప్రస్తుతం చంద్రబాబు పడుతున్న తపన చూస్తుంటే పగవాడికి కూడా ఈ కష్టమొద్దనిపిస్తుంది. అంతగా అధికారం కోసం దిగజారిపోతున్నాడాయన.

రాష్ట్రంలో తెలుగుదేశంపార్టీకి ఎటువంటి అనుకూలవాతావరణం లేదనేది తేటతెల్లమవుతుంది. అధికారం మీద ఆశ లేకుండాపోయింది. ఏదన్నా అద్భుతం జరిగితే గాని చెప్పలేం. కనీసం పార్టీ ఉనికిని కాపాడుకోవడానికైనా ఇప్పుడు కష్టపడక తప్పదు. ఇప్పటి వాతావరణంలో ఎన్నికల గోదాలోకి దిగాలంటే డబ్బుతో పనే! ప్రతి పనికి రాజకీయనాయకులు డబ్బులు వసూలుచేస్తున్నట్లే, ప్రతి రాజకీయ కార్యక్రమానికి కూడా జనం డబ్బు వసూలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లోక్‌సభ అభ్యర్థికి పాతికకోట్లు, అసెంబ్లీకి పోటీచేయాలంటే పదికోట్లు, మున్సిపల్ ఛైర్మెన్ అభ్యర్థికి 5కోట్లు, జిల్లా పరిషత్ ఛైర్మెన్ అయితే 15కోట్లు, జడ్పీటీసీకయితే 50లక్షలు... అన్నట్లుగా ముద్రపడిపోయింది. స్థానిక ఎన్నికలు తీసి పక్కనపెడితే రేపు అసెంబ్లీ ఎన్నికలే ప్రధాన సమస్య. కాంగ్రెస్ అధికారంలో (మిగతా 5వ పేజీలో)



# డీసీసీపై పీటముడి



ఈసారి అవకాశం బలవంతులకా? బలహీనులకా?

జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి ఎవరిదనే విషయమై ఇంకా సస్పెన్స్ కొనసాగుతూనే వుంది. జిల్లాలో ఎన్నికల సీజన్ మొదలయ్యింది. పంచాయితీలు, మున్సిపాల్టీలు, జిల్లా పరిషత్‌లు... ఈ ఎన్నికలన్నీ పూర్తయ్యే సరికి అసెంబ్లీ, లోకసభ ఎన్నికలు వచ్చి పడతాయి. ప్రస్తుతానికి నెల్లూరు నగర కాంగ్రెస్ అధ్యక్షుడిగా వున్న చాట్ల నరసింహారావునే ఇన్‌ఛార్జి డీసీసీ అధ్యక్షుడిగా పెట్టి కథ నడిపిస్తున్నారు. కాని రాబోయే ఎన్నికల సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని పూర్తిస్థాయి అధ్యక్షుడి నియామకం జరపాల్సివుంది. ఈ దిశగా పీసీసీ కూడా కసరత్తు చేస్తుంది.

అయితే ఎవరిని నియమించాలనే దానిపైనే చిక్కుముడి వీడడం లేదు. అధ్యక్ష కుర్చీని అగ్రవర్ణాలకే అప్పగించాలా? లేక బలహీనవర్గాలకు అప్పగించాలా? అనే మీమాంస కొనసాగుతుంది. ప్రధాన ప్రతిపక్షమైన తెలుగుదేశంపార్టీ జిల్లా కన్వీనర్‌గా బలహీనవర్గాలకు చెందిన బీద రవిచంద్ర వున్నాడు. అదే విధంగా వైకాపా జిల్లా కన్వీనర్‌గా కూడా బలహీనవర్గాలకు చెందిన మేరిగ మురళీధర్ వుండడం తెలిసిందే! జిల్లా కాంగ్రెస్ (మిగతా 5వ పేజీలో)

# శిరోభారంగా సారధ్యం!



> ఖర్చులు తడిసి మోపెడవుతుండడంతో భరించలేకపోతున్న జిల్లా నాయకులు
> అనవసరంగా నెత్తిన పెట్టుకున్నామని ఆవేదన

జెండాకి డబ్బులు... జెండా పట్టుకునే మనిషికి డబ్బులు... జైకొట్టే దానికి డబ్బులు... సభలో పాల్గొనాలంటే డబ్బులు... ధర్నాకు రావాలంటే డబ్బులు... రాజకీయమంటేనే డబ్బుమయమైపోయింది. పార్టీల మీద నాయకుల మీద కంటే కార్యకర్తల్లో ధనం మీద అభిమానం పెరిగిపోయింది. కాబట్టే రాజకీయ పార్టీల సారధ్యం అంటేనే నాయకులకు శిరోభారంగా మారుతోంది. వచ్చినా రాకున్నా పార్టీ కార్యక్రమాలను మాత్రం ఖచ్చితంగా నిర్వహించాల్సి వస్తుండడంతో పార్టీ నాయకత్వాలు నాయకులకు ఆర్థికభారంగా మారుతున్నాయి.

జిల్లా కాంగ్రెస్‌కు ఇంకా ఖచ్చితమైన నాయకత్వం లేదు. ఇన్‌ఛార్జ్ డీసీసీ అధ్యక్షుడిగా చాట్ల నరసింహారావు వున్నాడు. నడిచేది ఆయనే అయినా నడిపించేది ఆనం సోదరులు కాబట్టి ఆర్థికంగా ఆయనకు సమస్యలేమీ వుండవు. కాంగ్రెస్ అధికారపార్టీ కాబట్టి ప్రస్తుతం ఖర్చులకు ఇబ్బంది వుండదు.

సమస్యల్లా ప్రతిపక్షపార్టీల అధ్యక్షులకే! తెలుగుదేశంపార్టీ ఎత్తిపోయింది. దాదాపు 10ఏళ్లుగా పార్టీ అధికారానికి దూరంగా వుండడంతో నాయకులు కూడా ఎత్తిపోయారు. పార్టీలో పాడిఆవుల్లాంటి నాయకులు కూడా తగ్గిపోయారు. ఇంతకుముందు వీళ్లే ఖర్చులు భరించేవాళ్లు. ఇప్పుడు బొల్లినేని రామారావు లాంటి ఒకరిద్దరు తప్పితే ఖర్చును మోసేవాళ్లెవరూ లేరు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి భారం మోసిమోసి ఓపిక నశించే ఆ తలనొప్పిని వదిలించుకున్నాడు. బీద రవిచంద్ర తలకు (మిగతా 5వ పేజీలో)

# భూభాగోతంపై విచారణ జరపండి



మాట్లాడుతున్న బల్లి దుర్గాప్రసాద్, పక్కన బీద రవిచంద్ర

నెల్లూరుజిల్లాలో పరిశ్రమలకు కట్టబెట్టిన భూభాగోతంపై ప్రభుత్వం వెంటనే విచారణ జరపాలని గూడూరు ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్ డిమాండ్ చేశారు. సోమవారం నెల్లూరులో విలేకరులతో మాట్లాడారు. కృష్ణపట్నం పోర్టుకు చంద్రబాబునాయుడు భూమి కేటాయించారని, దీనిపై విచారణ జరపాలంటూ జగన్‌తల్లి విజయమ్మ, చెల్లెలు షర్మిల, వైకాపా నాయకులు పనికిరాని కాగితాన్ని చూపుతూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు నాయుడు సిఎంగా ఉన్న సమయంలో 1999లో కృష్ణపట్నంపోర్టుకు 1500ఎకరాల ప్రభుత్వ భూమిని నాటకో సంస్థకు కేటాయించారని దానిని కాంగ్రెస్ ప్రభుత్వం 2004లో రద్దుచేసి కృష్ణపట్నంపోర్టుకు అప్పగిస్తూ ఒప్పందం చేసుకుందన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా పోర్టుకు రోడ్డును కూడా 163కోట్ల ప్రభుత్వ ధనంతో నిర్మించారని ఆరోపించారు. ఎస్సీ జెడ్ కింద 2008లో కోట, చిల్లకూరు మండలాల్లో 10వేల ఎకరాలను సేకరించారని ఇందులో 4700ఎకరాలు కృష్ణపట్నం ఇన్‌ఫ్రాకు ఏపీఐఐసీ ద్వారా రిజిస్ట్రేషన్ చేసి స్వాధీనం చేశారన్నారు. తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర మాట్లాడుతూ కృష్ణపట్నంపోర్టు, పవర్‌ప్రాజెక్టుల ఏర్పాటులో పెద్దఎత్తున కిడ్‌ఫ్రాకో జరిగిందని ఆరోపించారు. పరిశ్రమలకు తాము వ్యతిరేకంకాదని కాని పేదల కడుపు కొడుతూ నిబంధనలకు విరుద్ధంగా భూకేటాయింపులు చేస్తే పోరాడుతామని హెచ్చరించారు.

# కొత్త డివిజన్‌లకు 6కోట్లు

**- ఆనం రామనారాయణరెడ్డి**

రాష్ట్ర ప్రభుత్వం నెల్లూరుజిల్లాలో కొత్తగా రెండు డివిజన్లు ఏర్పాటుచేసి ఆయా డివిజన్లకు 6కోట్లు నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కొత్త డివిజన్‌లకు ఒక్కొక్కదానికి 3కోట్లు చొప్పున 6కోట్లు విడుదల చేయడం జరిగిందన్నారు. క్యాబినెట్ ఆమోదం పొందిన తర్వాత త్వరలో నెల్లూరు అర్బన్ తహశీల్దారు కార్యాలయం ఏర్పాటు కానుందని తెలిపారు. దీంతో నెల్లూరు రూరల్, నగరం కలిపి రెండు తహశీల్దార్ కార్యాలయాలు ఉంటాయన్నారు. కొత్త డివిజన్‌లకు గెజిట్ ప్రచురితం అయిన తర్వాత రెవెన్యూ డివిజన్ కార్యకలాపాలు ప్రారంభమవుతున్నాయన్నారు. ఈ డివిజన్‌లకు సంబంధించి ఆర్డీఓలను నియమించడం జరిగిందన్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీ కాంతం, అదనపు జాయింట్ కలెక్టర్ సిహెచ్ పెంచలరెడ్డి, డిఆర్ఓ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వైయస్సార్ పథకాలను...

# తుంగలో తొక్కారు!



ప్రజలకు అభివాదం చేస్తున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పొదలకూరులోని కాకాణి రమణారెడ్డికాలనీ, టైలర్స్‌కాలనీ, విఘ్నేశ్వరపురంకాలనీల్లో ఈనెల 23న వైఎస్సార్సీపీ సీఈసీ సభ్యులు, సర్వేపల్లి నియోజకవర్గ సమన్వయకర్త కాకాణి గోవర్ధన్‌రెడ్డి దీవెనయాత్ర జరిపాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, మండల కేంద్రాల్లో దళారులు తయారై పేదల కడుపు కొడుతున్నారని విమర్శించారు. పేదలను బెదిరించి వారి ఫ్లాట్లను ఆక్రమించి సొమ్ము చేసుకున్న దళారుల మెడలు వంచి తిన్నది కక్కిస్తామన్నారు. దళారులకు రెవెన్యూ అధికారులు సహకరిస్తూ పేదల కడుపులు కొడుతున్నారన్నారు. వైయస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు న్యాయంచేసి, అన్యాయానికి పాల్పడ్డ అధికారులపై న్యాయవిచారణ జరిపించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ప్రభుత్వం ఎంతోకాలం వుండదని, వైయస్సార్సీపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. అక్రమాలకు పాల్పడ్డ ఎవ్వరినీ ఉపేక్షించేదిలేదని, దళారుల కొమ్ముకాసిన రెవెన్యూ అధికారులను సైతం వదిలేది లేదన్నారు. కిరణ్ ప్రభుత్వం వైయస్సార్ పథకాలన్నింటినీ తుంగలో తొక్కుతుందన్నారు. వృద్ధులు ఫింఛన్లురాక నానాఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. కార్యక్రమంలో జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, కోనం బ్రహ్మయ్య, గోగిరెడ్డి గోపాల్‌రెడ్డి జడ్పీటీసీ మాజీ సభ్యుడు వాసవి భాస్కర్‌గౌడ్, వైయస్సార్సీపీ పొదలకూరు మండల కన్వీనర్ పెదమల్లు రమణారెడ్డి, వైయస్సార్సీపీ తోటపల్లి గూడూరు మండల కన్వీనరు టంగుటూరు పద్మనాభరెడ్డి, జివి వెంకటరత్నం నాయుడు, వాకాటి శ్రీనివాసులురెడ్డి, గంపల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# దొంగ ఐపిఎస్ అరెస్ట్

**6లక్షల సొత్తు స్వాధీనం**



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ బి.వి.రమణకుమార్

నెల్లూరుజిల్లా గూడూరు పట్టణం శాంతినగర్‌లోని ఓ ఇంటి ముందు ప్రత్యక్షమయ్యే నేమ్‌బోర్డు నవీన్‌చంద్ర, ఐపియస్... సిబిఐ డిపార్ట్‌మెంట్. కాని ఆ ఇంట్లో నివసించేది మాత్రం ఓ దొంగ... అతను ఐపియస్ అధికారి కావాలని కన్న కలలు కల్లలై దొంగగా మారాడు. ఇది నిజం దొంగతనం చేసేది ఎవరి కోసమో కాదు అతను గాఢంగా ప్రేమించి పెళ్ళిచేసుకున్న యువతుల కోసం... ఖాకీ డ్రస్సు వేసుకొని దర్జాగా ఠీవీగా తిరగాలన్నా అతని కల తీరకుండానే కటకటాల వెనక్కి వెళ్ళి వూచలు లెక్కిస్తున్నాడు. మంచి క్రైంస్టోరీని తలపిస్తున్న ఈ నవీన్‌చంద్ర ఐపియస్ వివరాలను గూడూరు డిఎస్పీ చౌడేశ్వరి ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ సోమవారం సాయంత్రం ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు.

గూడూరు శాంతినగర్‌కు చెందిన పాలేపాటి నవీన్‌చంద్రకు ఇద్దరు భార్యలు. వీరికి ఇద్దరు కుమారులు. నవీన్‌చంద్ర గూడూరు పట్టణంలోని ఓ కొరియర్ షాపులో డెలివరీ బాయ్‌గా పనిచేస్తున్నాడు కుటుంబపోషణ కష్టంగా మారడంతో డోర్‌డెలివరి చేస్తూ అక్కడున్న ఇత్తడి, అల్యూమినియం వస్తువులు గ్యాస్ సిలిండర్లు దొంగిలించేవాడు. ఈ క్రమంలో మే నెల 24వతేదీ రాత్రి గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో చోరీకి పాల్పడ్డాడు. కార్యాలయంలోని ప్లాస్మాటివీ, కంప్యూటర్లు, వెబ్‌కెమెరాను దొంగిలించాడు. చోరీ జరిగిన విషయం పెద్దఎత్తున కలకలం రేగడంతో దొంగిలించిన వస్తువులను ఇంట్లోనే దాచాడు. ఈ నెల 23వతేదీ ఆదివారం రాత్రి గూడూరు సబ్‌కోర్టులో ఉన్న కంప్యూటర్లు దొంగతనం చేసేందుకు ప్రయత్నించాడు. సోమవారం తెల్లవారు జామున వెంకటగిరి క్రాస్‌రోడ్డు వద్ద నిందితుడు పోలీసులను చూసి పరారయ్యాడు. దీంతో గూడూరు పట్టణ సిఐ సత్యనారాయణ ఒకటవ, రెండవ పట్టణ ఎస్సైలు షేక్ షరీఫ్, అంకమరావు తమ సిబ్బందితో వెంటాడి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. అతని చేతిలోని సంచిని పరిశీలించగా వీడియో కాన్ఫరెన్స్‌కు ఉపయోగించే వీడియో కెమెరా వుంది దీంతో పోలీసులు తమదైన స్టైల్లో విచారించగా తాను చేసిన చోరీల వివరాలను తెలిపాడని వివరించారు. నిందితుడి వద్ద నుంచి 6లక్షలు విలువచేసే సొత్తును స్వాధీనం చేసుకున్నారు. నెల్లూరు జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ కేసును అనతికాలంలోనే ఛేదించిన గూడూరు డిఎస్పీ చౌడేశ్వరి గూడూరు పట్టణ సిఐ యు.సత్యనారాయణ, ఎస్సైలు షేక్ షరీఫ్, బి.అంకమరావు సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఐఆర్‌యస్‌మూర్తి, గూడూరు, నెల్లూరు రూరల్, నగర డిఎస్పీలు చౌడేశ్వరి బాలవెంకటేశ్వరరావు, పి.వెంకటనాథ్‌రెడ్డి, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# చెరువు ఎండుతోంది... పొలం మండుతోంది!

నైరుతి ఋతుపవనాలు వచ్చాయి... పోను కూడా పోయాయి. ఆశించినంతగా వర్షాలు లేవు. మన ముఖాన నాలుగు చినుకులను విదిల్చి వెళ్ళాయి. ఇక ఈశాన్య ఋతుపవనాలు వచ్చేదాకా మనకు వర్షాలకు దిక్కులేదు. అంటే అక్టోబర్, నవంబర్ నెలలదాకా ఆకాశం కేసి చూడాల్సిన పనిలేదు.

మరి ఈలోపు ఏంటన్నదే ప్రశ్న? వాస్తవంగా మన జిల్లాలోకంటే కూడా మన ఎగువజిల్లాల్లో వర్షాలు కురిస్తేనే మనకు ప్రయోజనం. కర్నాటకలో భారీవర్షాలు కురిస్తే ఇంకా ఆనందం. ఎందుకంటే అక్కడ వరదలు వస్తేనే కృష్ణ, పెన్నా నదులకు ప్రవాహం వస్తుంది. ఒకవేళ పెన్నకు వరద రాకపోయినా కృష్ణానది పోటెత్తితే చాలు, శ్రీశైలం నిండుతుంది. ఆ రిజర్వాయర్ నిండిందంటే ఆటోమేటిక్‌గా సోమశిలకు నీళ్లొస్తాయి. రైతులకు సమస్య తీరుతుంది. పంటలకు నీటి బాధ తప్పుతుంది. గత 5ఏళ్లుగా కృష్ణ నీళ్లతోనే మనం సోమశిల రిజర్వాయర్‌ను నింపుకుంటున్నాం. గత రెండేళ్లుగా కృష్ణా నదికి వరద ప్రవాహం లేదు. దీంతో తగినస్థాయిలో సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లలో నీటిని నిల్వ చేయలేకున్నాం.

వై.యస్. సీయం అయ్యాక సోమశిల రిజర్వాయర్ నీళ్లతో కళకళలాడసాగింది. అంతకుముందు పెన్నకు వరదొస్తేనే సోమశిలలో నీళ్లుండేవి. వై.యస్. సీయం అయ్యాక సోమశిల నీటి నిల్వ సామర్థ్యాన్ని 78టీఎంసీలకు పెంచాడు. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ ద్వారా ప్రతి ఏటా శ్రీశైలం డ్యాం నుండి సోమశిలకు నీళ్ళు నింపే వాళ్లు. దీంతో 2008 నుండి కూడా సోమశిల రిజర్వాయర్‌లో నీళ్లు సమృద్ధిగా వుంటున్నాయి. జిల్లాలో అధికారికంగా 3లక్షల ఎకరాలలో, అనధికారికంగా అంతకంటే ఎక్కువ ఎకరాలకు రెండుకార్లకు నీళ్లిస్తూ వచ్చారు. ఆయకట్టుకే కాకుండా చెన్నై, చిత్తూరు, నెల్లూరులకు కూడా తాగునీటిని సోమశిల నుండే అందించడం జరిగింది. కృష్ణ పుణ్యమా అని సోమశిలలో చూస్తే 2008లో 40టీఎంసీలు, 2009లో 25టీఎంసీలు, 2010లో 29టీఎంసీలు, 2011లో 50టీఎంసీలు, 2012లో 33 టీఎంసీలు నీటి నిల్వలున్నాయి. కాని గత ఏడాది, ఈ ఏడాది కృష్ణకు వరద రాలేదు. సోమశిలకు ప్రతి ఏటా నీళ్లందిస్తున్న శ్రీశైలం డ్యామే ఎండిపోయే పరిస్థితి ఏర్పడింది. కడప, కర్నూలు జిల్లాల్లో కూడా తగిన వర్షాలు లేవు. ఎగువ నుండి ప్రవాహం లేకపోవడం, ఎండల ప్రభావంతో నీటి వాడకం పెరగడంతో సోమశిలలో ప్రస్తుతానికి 8టీఎంసీలు మాత్రమే నీళ్లున్నాయి. ఈ సీజన్‌కు ఇక వర్షాలు లేనట్లే. ప్రస్తుతం వున్న నీటిని చెన్నైతో పాటు మన తాగునీటి అవసరాలకు కూడా కేటాయించాల్సివుంది. తాగునీటికి వున్న నీళ్లు సరిపోతే సాగునీళ్ల సమస్యను ఇక ఆ వరుణదేవుడు తీర్చాల్సిందే!

## చార్‌ధామ్ మృతుల ఆత్మశాంతికి శాంతియజ్ఞం



చార్‌ధామ్ వరద ప్రవాహంలో మృతి చెందిన వేలాదిమంది భక్తుల ఆత్మలకు శాంతి చేకూరాలని, అక్కడ చిక్కుకుపోయి ఇబ్బందులు పడుతున్నవారు తిరిగి వారి స్వస్థలాలకు చేరుకోవాలని కోరుతూ నెల్లూరు పప్పులవీధిలోని శ్రీ దత్తాత్రేయ మఠంలో మంగళవారం శాంతియజ్ఞం నిర్వహించారు. వేదపండితుడు మాచవోలు రమేష్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవంలో కుర్తాళం సిద్దేశ్వరిపీఠం ఆస్థాన పండితుడు మాచవోలు రాజశేఖరశాస్త్రి పాల్గొని తొలుత ప్రత్యేక శాంతిపూజలు నిర్వహించారు. అనంతరం సకల దేవతలను ధ్యానిస్తూ వేదపండితులు నిర్వహించిన రుద్రహోమం ఆయుష్‌హోమాలు వైభవంగా జరిపారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని వారికోసం దేవతలను ప్రార్థించారు.

## వాసవిక్లబ్ పుస్తకాల పంపిణీ



వాసవి క్లబ్, నెల్లూరు, వనిత క్లబ్ వారు సంయుక్తంగా ఈ నెల 22వ తేదీన పొదలకూరు మండలం మరుపూరు జడ్పీ హైస్కూల్‌లో 120మంది పిల్లలకు నోట్‌బుక్స్, పెన్నులు, ఆటవస్తువులు పంపిణీ చేసారు. అలాగే స్కూల్ ఆవరణంలో మొక్కలు నాటారు. క్లబ్ గవర్నర్ ఎస్.పద్మజ పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ గవర్నర్ ఎం.సతీష్, వి.ఇ.మురళీకృష్ణ, జోన్‌ఛైర్మెన్ పి.లక్ష్మీ, క్లబ్ అధ్యక్షులు సి.వి.శరణ్‌కుమార్, ఉమారాణి, ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



## కోవూరు కాంగ్రెస్‌లో... ఎవరికి వా(ర్)రే!



**రాజకీయచైతన్యానికి పెట్టనికోటలాంటి కోవూరు కాంగ్రెస్‌లో ఇప్పుడు వర్గరాజకీయాలు జోరుమీదున్నాయి.**

ఇక్కడ మాజీఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, జిల్లా సహకార మార్కెటింగ్ కమిటీ ఛైర్మెన్‌ల మధ్య వర్గపోరు నడుస్తుంది. ఈమధ్య హైదరాబాద్‌లో సీఎం, పీసీసీ అధ్యక్షుడికి సమక్షంలో జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలోనే పోలంరెడ్డి, సుమంత్‌రెడ్డిలు ఒకరిపైఒకరు ఆరోపణలు చేసుకోవడం గమనార్హం.

2004లో తెలుగుదేశం నుండి కాంగ్రెస్‌లోకి వచ్చిన పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కోవూరు నుండి సంచలన విజయం సాధించాడు. ఎమ్మెల్యేగా 5ఏళ్లు బాగానే పనిచేసాడు. నియోజకవర్గంలో బాగా తిరిగి మంచిపేరు తెచ్చుకున్నాడు కూడా! గ్రహచారమో, అతను చేసిన అపచారమో గాని 2009ఎన్నికలలో నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి చేతిలో ఓడిపోయాడు. దీంతో పోలంరెడ్డి రాజకీయంగా కొంత బలహీన పడ్డట్లయ్యింది. ఈ సమయంలోనే వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి అనే యువనాయకుడు ఎంటరయ్యాడు. ప్రసన్న రాజీనామాతో కోవూరుకు ఉపఎన్నికలు వచ్చినప్పుడు కాంగ్రెస్ టిక్కెట్‌రేస్‌లో పోలంరెడ్డికి తీవ్ర పోటీ ఎదురయ్యింది. ఓపక్క పట్టాభి, మరోపక్క అప్పుడే రాజకీయాల్లోకి అడుగుపెట్టిన సుమంత్‌లు టిక్కెట్ కోసం ప్రయత్నించారు. అయితే ఆరోజున్న పరిస్థితుల దృష్ట్యా అధిష్టానం పోలంరెడ్డినే అభ్యర్థిగా ఖరారు చేసింది. ఉపఎన్నికలలో పోలంరెడ్డి మూడోస్థానానికి పోవడంతో మరింత వీకయ్యాడు. ఇక్కడే ప్రత్యర్థి వర్గం బలపడసాగింది.

ముఖ్యమంత్రి కిరణ్‌కు సమీప బంధువైన సుమంత్‌రెడ్డి డీసీఎంఎస్ ఛైర్మెన్‌గా ఎన్నికయ్యాడు. దీంతో కొంత బలం ఏర్పడింది. సీఎం ఆశీస్సులుండడంతో అధికారులు సైతం సుమంత్‌కే సలాం కొడుతున్నారు. అధికారులు పనిచేస్తుండడంతో ఆటోమేటిక్‌గా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సుమంత్ వద్దకే పోవడం మొదలు పెట్టారు. అదీగాక ఈమధ్యకాలంలో పోలంరెడ్డి తెలుగుదేశంలోకి పోతున్నాడనే ప్రచారం జోరందుకుంది. ఇది కావాలనే సుమంత్‌రెడ్డి చేయిస్తున్నాడని పోలంరెడ్డి వాదిస్తున్నారు. మొన్న సీఎం ముందు కూడా ఇదే విషయంపై వాదన జరిగింది. మొత్తానికి కోవూరులో పోలంరెడ్డికి, సుమంత్‌రెడ్డికి బాగానే పడింది. రాబోయే కాలంలో ఎవరిది పైచేయి అవుతుందో కాలమే నిర్ణయిస్తుంది.

## రెండేళ్ళ పాలన సంతృప్తినిచ్చింది

**- జిల్లా ఎస్పీ బివి రమణకుమార్**



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్

నెల్లూరుజిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టి మంగళవారంతో రెండేళ్ళు పూర్తయ్యాయని ఈ రెండేళ్ళ పాలన ఎంతో సంతృప్తినిచ్చిందని నెల్లూరు జిల్లా ఎస్పీ బివి రమణకుమార్ పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరు ఉమేష్‌చంద్ర సమావేశ మందిరంలో విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ప్రత్యేక పంథాలో ముందుకెళ్ళామని ఈ రెండేళ్ళలో నేరాలు తగ్గాయన్నారు. తాను బాధ్యతలు చేపట్టాక ఓ ప్రక్క శాంతిభద్రతల నియంత్రణ, మరో ప్రక్క పోలీసుసేవా కార్యక్రమాలపై దృష్టిపెట్టానన్నారు: బోడిగాడితోట శ్మశానవాటికలోని పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు క్యాంప్‌ను ప్రారంభించి అనతికాలంలోనే జాతీయస్థాయి గుర్తింపు పొందినట్లు తెలిపారు. అనాథపిల్లలు, వీధి పిల్లలకోసం జిల్లాలోని 69పోలీసుస్టేషన్లలో 69సిడబ్ల్యూసిలను ఏర్పాటు చేశామన్నారు. మహిళా సమస్యల పరిష్కారానికి ఉమెన్స్ కౌన్సిలింగ్ కేంద్రాన్ని ఏర్పాటుచేసి ఎన్నో కుటుంబాలను చక్కదిద్దుతున్నామన్నారు. ఈ రెండు కార్యక్రమాలు రాష్ట్రంలో మన జిల్లాలోనే ఏర్పాటుచేశామని ఈ తరహా కార్యక్రమాలను అన్ని జిల్లాల్లో చేపట్టేలా చర్యలు తీసుకుంటామని డిజిపి దినేష్‌రెడ్డి ప్రకటించారని అన్నారు. నెల్లూరుజిల్లాలో జరిగే పోలీసు గ్రీవెన్స్‌డేను ఆదర్శంగా తీసుకుని అన్ని జిల్లాల్లో ప్రారంభించారన్నారు. జాతీయ రహదారిపై నేరాలు, ఎర్రచందనం, రేషన్‌బియ్యం అక్రమ తరలింపును అడ్డుకునేందుకు హైవే పెట్రోలింగ్, చెక్‌పోస్టులు ఏర్పాటుచేశామన్నారు. అందరి సహకారంతో రెండేళ్ళ పాలన విజయవంతంగా పూర్తిచేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీకి పలువురు అధికారులు అభినందనలు తెలియజేశారు.

## డిగ్రీలో "డికె" విద్యార్థుల డిస్టింక్షన్లు

డిగ్రీ ఫలితాల్లో నెల్లూరు డికెడబ్ల్యూ కళాశాల విద్యార్థులు 42మంది డిస్టింక్షన్లు సాధించి తమ సత్తా చాటారని ప్రిన్సిపల్ డా॥ఎ.శారదాదేవి తెలిపారు. బికాంలో 10మంది, బిఎస్సీలో 32మంది ఈ ఘనత సాధించారని వివరించారు. మొత్తం 350 మందికిగాను 300మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. బిఏలో నలుగురు, బికాంలో 57, బిఎస్సీలో 76మంది ప్రథమస్థానాలను సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ ఉదయభాస్కర్, కామర్స్ అధ్యాపకులు కుసుమకుమారి, పిడి రవీంద్రమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

## రంగడికి మామిడి రసాభిషేకం

నెల్లూరు రంగనాయకులపేట పినాకినీ నదీ తీరాన వెలసియున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో ఆదివారం దేవేరుల సమేత శ్రీస్వామి వారికి మామిడిపండ్లరసంతో అభిషేక మహోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, ప్రధానార్చకులు కిడాంబి జగన్నాథాచార్యుల నేతృత్వంలో జ్యేష్ఠమాసం పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ఈ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం శ్రీ రంగనాథస్వామికి చందనాలంకారము నిర్వహించారు.

## తెలుగును వెలిగిద్దాం!




సదస్సులో ప్రసంగిస్తున్న ఉపకులపతి ఆచార్య రాజారామిరెడ్డి

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, భారతీయ భాషల కేంద్ర సంస్థల సంయుక్త నిర్వహణలో విశ్వవిద్యాలయ కళాశాల సమావేశ మందిరంలో ఆధునిక తెలుగు వ్యాకరణంపై ఈనెల 24న వర్క్‌షాప్ జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య జి.రాజారామిరెడ్డి మాట్లాడుతూ క్రమబద్ధంగా తెలుగు మాట్లాడేందుకు వ్యాకరణం ఉపయోగపడుతుందని, వచ్చే సంవత్సరం నుంచి విశ్వవిద్యాలయంలో తెలుగును రెగ్యులర్ డిపార్ట్‌మెంట్‌గా చేపడతామన్నారు. తెలుగు భాష విభిన్నమైనదని, వైవిధ్యమైన మాండలికాలతో అలరారుతోందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ మనసులోని భావాలను స్పష్టంగా తెలిపే లిపి వున్న భాష తెలుగు ఒక్కటేనని అన్నారు. అటువంటి ప్రత్యేకతగల తెలుగుభాషపై మక్కువతో వ్యాకరణంపై పట్టు సాధించాలన్నారు. ఎస్వీ యూనివర్శిటీ విశ్రాంత ఆచార్యులు కాటూరు శారద మాట్లాడుతూ తెలుగు వాక్య, పద నిర్మాణాల్లో అవగాహన పెంచుకొని, ఆధునిక తెలుగు వ్యాకరణంపై మరింత అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త డాక్టర్ పరంధామరెడ్డి, వివిధ విశ్వవిద్యాలయాల అధ్యాపకులు, తెలుగు శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

PDF Compressor Free Version






## సాహసయాత్రలే!

ఉత్తరాఖండ్ వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. వేలాది మందిని పొట్టనపెట్టుకున్నాయి. ప్రకృతి కన్నెర్ర జేస్తే పెనువిపత్తులు తప్పవనేదానికి ఈ వరదలే సాక్ష్యం. దీనిని ప్రభుత్వ వైఫల్యంగా కూడా భావించలేం. అక్కడ చిక్కుకున్న తెలుగువారి బాధలు వర్ణనాతీతం. కనీసం వారిపై జాలిచూపే వారే కరువయ్యారు. మానవత్వం చూపాల్సిన స్థానికులు వారిని దోచుకుతిన్నారు. ఏదేమైనా వరద బాధితులకు మన సైన్యం అందించిన సాయం మాత్రం అభినందనీయం. వారికి చేతులెత్తి నమస్కరించాల్సిందే!

డి.బోస్, ఒంగోలు.

## కార్పొరేషన్‌లోనూ సంకీర్ణమే

నెల్లూరు నగరపాలకసంస్థకు ఎన్నికలు జరిగితే అక్కడా సంకీర్ణ ఫలితాలు తప్పవు. 54డివిజన్‌లలో కాంగ్రెస్, తెలుగుదేశం, వైకాపాలు సమానంగా గెలిచే అవకాశాలున్నాయి. అప్పుడు కాంగ్రెస్‌పార్టీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతుంది. ఇండిపెండెంట్లను, ఇతర కార్పొరేటర్లను కొనే పరిస్థితి వస్తుంది.

వాస్తు రామచంద్ర,
నెల్లూరు.

## ఎవరి ప్రారబ్ధం?

ప్రారబ్ధం వల్లే రాజకీయాల్లోకి వచ్చానని సీఐఐ సదస్సులో రాహుల్ గాంధీ అన్నారు. ఆయన ప్రారబ్ధం కాదు. భారత ప్రజల ప్రారబ్ధం వల్ల కాంగ్రెస్‌పార్టీ సోనియా నేతృత్వంలో నడుస్తోంది. విభజన రాజకీయాలు ప్రగతికి చేటు అని రాహుల్ అన్నారు (మోడీని ఉద్దేశించి). మోడీ గుజరాత్‌ను రెండు భాగాలుగా విభజించలేదు. రాహుల్ వక్రదృష్టికి అలా కనపడి ఉండొచ్చు! ప్రజలను రెండు వర్గాలుగా విభజించింది కాంగ్రెసే! కాంగ్రెస్‌కు అడుగులకు మడుగులొత్తుతూ చెక్కభజన చేసే వర్గ మొకటి. చెక్కభజన చేయకుండా స్వతంత్రంగా వ్యవహరించే వర్గం మరొకటి. ఈ రెండవవర్గం మీద కాంగ్రెస్ సీబీఐ(ఛీబీఐ)ని ఉసి గొల్పుతోంది కుందేళ్ల మీదకు వేటకుక్కలను ఉసిగొల్పినట్టు!

కురుగూరు రంగనాథం,
నెల్లూరు.

## 'ప్రభా'తం

అక్కడ గంగమ్మ గంగవెర్రులెత్తింది. తనను కలుషితం చేస్తున్న జనంపై శివ తాండవం చేసింది. ఊర్లను ఊడ్చేసింది. పెద్దభవనాలను తనతో లాగేసుకుంది. వేలాదిమంది బ్రతుకులను ముంచేసింది. కొండలు కరిగిపోయాయి. మట్టి దిబ్బల్లా కూలిపోయాయి. ఎన్నో బ్రతుకులు వాటి కింద సజీవ సమాధి అయ్యాయి.

అక్కడ నీళ్లే కాదు కన్నీళ్లు కూడా వరద ప్రవాహాన్ని తలపిస్తున్నాయి. పుణ్యభూమి అంటూ అక్కడికి వెళ్లిన వేలాదిమంది మరుభూమిలో కలిసిపోయారు. కొండలు, లోయల్లో శవాలు గుట్టలుగుట్టలుగా పడివున్నాయి. ముక్తికోసం వెళ్లిన వాళ్లకు ఈ జీవితం నుండే ముక్తిని ప్రసాదించింది ఆ ప్రకృతి.

ఉత్తరాఖండ్... ఎన్డీఏ ప్రభుత్వంలో ఉత్తరప్రదేశ్ నుండి విభజించిన ఓ చిన్న రాష్ట్రం. ఈ రాష్ట్రం మొత్తం విస్తీర్ణం 53వేల చదరపు కిలోమీటర్లు. ఇందులో 38వేల చదరపు కిలోమీటర్ల ప్రాంతం ఇప్పుడు వరదల బారిన పడింది. ఈ రాష్ట్ర భూభాగంలో 86శాతం కొండలు, లోయలు, అడవులే! దేవతలు తిరుగాడుతారనే పేరున్న హిమాలయాలు ఈ రాష్ట్రంలో వున్నందున దేవభూమిగా కూడా పిలుస్తుంటారు. ఈ భూభాగం నివాసానికి అంతగా యోగ్యమైంది కాదు. వ్యవసాయమూ తక్కువే! అయితే దేశానికి ఉత్తరసరిహద్దులో వున్న హిమాలయాలు మన దేశాన్ని శత్రుదేశాల నుండి కాపాడే రక్షణ గోడలుగా వుంటాయి. మామూలు పరిస్థితులలో అయితే ఇక్కడ ఎవరూ వుండరు. ఇక్కడి వాతావరణం కూడా అందుకు అనుకూలించదు. పూర్వకాలంలో శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యుల వారు ఇక్కడ పర్వతాలలో పలు ప్రసిద్ధ పుణ్యక్షేత్రాలను ఏర్పాటు చేశారు. కేదార్‌నాథ్, బదరీనాథ్, రుద్రప్రయాగ, ఉత్తరకాశీ, గంగోత్రి, యమునోత్రి వంటి పుణ్యక్షేత్రాలు ఈ విధంగా ఏర్పడ్డవే! భారతీయ సంస్కృతిలో పుణ్యనదులుగా భావించే గంగ, యమున, సరస్వతి నదులు ఈ హిమగిరుల్లోనే పుట్టి ప్రవహిస్తుంటాయి. ప్రతి ఏటా కూడా జమ్మూ మొదలుకొని కన్యాకుమారి వరకు లక్షల సంఖ్యలో భక్తులు ఈ పుణ్యక్షేత్రాల సందర్శనకు తరలివస్తుంటారు. భక్తులు పెద్దసంఖ్యలో వస్తుండబట్టి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా సైనిక, పోలీసు బలగాలను నియమిస్తుంటాయి. ఈ విధంగా పుణ్యక్షేత్రాలను నెలకొల్పడం, పుణ్యనదుల పుష్కరాలను ఈ దేశ సంస్కృతిలో ఒక భాగం చేయడం ద్వారా హిమగిరులను రక్షించుకునే ఓ విశిష్టమైన కార్యక్రమానికి ఆనాడే రూపకల్పన చేసారు ఆదిశంకరాచార్యులు. ఉత్తరాఖండ్ రాష్ట్రం మొత్తం జనాభా కోటి పాతిక లక్షలు. కాని ప్రతి ఏటా అక్కడకి వచ్చే యాత్రికుల సంఖ్య ఆ రాష్ట్ర జనాభాకన్నా ఎక్కువే! ప్రకృతి రమణీయత అంతా ఇక్కడి హిమగిరుల్లోనే ఒదిగిపోయినంత అందంగా వుంటుంది వాతావరణం. కొండ ల్లోనే రహదారులు, రహదారుల పక్కనే వేలఅడుగుల లోతు లోయలు... ఏ మాత్రం అదుపు తప్పిందా... మన ప్రాణాలు మనవి కాదు. హిమాలయాలలో అత్యంత ఎత్తైన ప్రాంతాలు ఇక్కడే వున్నాయి. సముద్ర మట్టానికి 11వేల అడుగుల ఎత్తులో వున్న బదరీనాథ్, కేదారనాథ్ ప్రాంతాలలో ఒక్కోసారి ఆక్సిజన్ అందడం కూడా కష్టమే. హృదయ, ఛాతి సమస్యలున్నవారు ఈ యాత్రలకు వెళితే చాలా ఇబ్బందులు పడుతుంటారు.

వాతావరణం పరంగా చాలా దుర్భర పరిస్థితులుంటాయిక్కడ. కొండచరియలు ఎప్పుడు పడతాయో, రోడ్లు ఎప్పుడు తెగుతాయో తెలీదు. ఒక రకంగా ఇది సాహసయాత్రే. ఇలాంటి ప్రాంతాలకు లక్షల్లో భక్తులు వస్తున్నారంటే అది భక్తి, నమ్మకంతో కూడిన విశ్వాసమే తప్ప ఇంకోటి కాదు.

ఈ రాష్ట్రంలో ఛార్‌ధామ్ వెళ్లే మార్గాలయితే అత్యంత ప్రమాదకరంగా వుంటాయి. పర్వతాల అంచునే 20 నుండి 30 అడుగులే వుండే రహదారులపై వాహనాలలో వెళ్లాలి. ఏ మాత్రం అదుపుతప్పితే లోయలో, లేదా నదుల్లో పడక తప్పదు. ఈ లోయల్లోనే యమున, భగీరథి, మందాకిని, అలకనంద నదులు ప్రవహిస్తుంటాయి.


ఛార్‌ధామ్‌కు సమీపంలో 'మన' అనే ఊరు వద్ద సరస్వతీనది కనిపిస్తుంది. అక్కడ తప్పితే ఇంకెక్కడా ఈ నది కనిపించదు. అంతర్వాహినిగా ప్రవహిస్తుంది. గుజరాత్‌లోని అలహాబాద్ వద్ద ఈ నది అంతర్వాహినిగా కలుస్తుంది కాబట్టే దీనిని త్రివేణి సంగమం అంటారు. ఈ సరస్వతీ పుష్కరాల కోసమే ఈసారి భక్తులు లక్షల సంఖ్యలో వెళ్లారు.

పెద్దసంఖ్యలో భక్తులు వస్తున్నా, వారికి తగిన సౌకర్యాలు కల్పించడం లోగాని, మౌలికసదుపాయాల కల్పనలోగాని ఆ రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడే వుంది. అంతేకాదు యాత్రికులు పెద్ద సంఖ్యలో వస్తుండడంతో ఇక్కడ ప్రజలలోనూ వ్యాపార ధోరణులు పెరిగాయి. ఎక్కడికక్కడ కొండలను ఆక్రమించి భారీ భవనాల నిర్మాణం చేపట్టారు. పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నా గంగా పరివాహక ప్రాంతంలో భారీగా జలవిద్యుత్ ప్రాజెక్టులకు అనుమతులిచ్చారు. ప్రకృతిని మనం వాడుకుంటే అది మనతో ఆడుకుంటుందనే దానికి నేడు అక్కడ చోటుచేసుకుంటున్న పెనువిషాదమే తార్కాణం.

వరద ఉప్పెనకు లక్షలాది మంది యాత్రికులు చిగురుటాకుల్లా వణికిపోయారు. వరద ప్రవాహంలో ఎన్నివేలమంది కొట్టుకుపోయారో ఇంకా ఒక అంచనాకు రాలేకపోతున్నారు. కేధారనాథ్ ఆలయం గర్భగుడిలోనే శవాలు గుట్టలుగా పడ్డాయి. మరణించినవారు మరణించగా ప్రాణాలతో బయటపడ్డవాళ్లు నరకయాతన అనుభవించారు. వారి కళ్లముందే మృత్యువు తారసపడినట్లయ్యింది. ఉత్తరాఖండ్‌లో చిక్కుకుని యాత్రికులు మృత్యువుతో పోరాడుతుంటే, వివిధ రాష్ట్రాలలో వున్న వారి బంధువులు వారి యోగక్షేమాల కోసం పరితపించారు.

ప్రకృతి ప్రకోపించినప్పుడు ఎంతటి వారైనా తలవంచాల్సిందే! ఉత్తరాఖండ్ బాధితులను ఆదుకోవడంలో ఆ రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా వ్యవహరించలేకపోయింది. విచ్చలవిడిగా హైడెల్ ప్రాజెక్టులకు అనుమతించడం, అడవులను నరికేయడం, ఇసుకను తోడేయడం వల్ల ముప్పు పెరిగింది. ఈ ఆపత్కాలంలో భారత సైన్యం నిర్వహించిన పాత్ర మాత్రం అద్భుతం... అమోఘం. వారే సరైన సమయానికి రంగంలోకి దిగకపోయివుంటే మృతులు వేలు దాటి లక్షల్లోకి వెళ్లినా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదు.

### కన్నీటి వరదలు



ఇది ఊహించని విపత్తు. దేవుడ్ని చూడ్డానికి వెళ్లిన భక్తులు ఆ దేవుడు దగ్గరకే తాము శాశ్వతంగా వెళతామనుకోలేదు. గంగమ్మ గంగ వెర్రులెత్తడంతో ఉత్తరాఖండ్ వణికిపోయింది. కొండల్లో కోనల్లో వేల అడుగుల లోయల్లో యాత్రికుల శవాల గుట్టలు చూస్తే కన్నీళ్లు వరదప్రవాహమవుతున్నాయి.

## 'అంతర్'జాతీయం

- పాకిస్థాన్‌లో తాలిబన్‌లు విదేశీయులపై పంజా విసిరారు. 22వ తేదీ రాత్రి ఉత్తరపాక్‌లోని బోకర్‌లోయలో పర్వతారోహకుల క్యాంప్‌పై 16మంది తాలిబన్‌లు దాడిచేసారు. ఐదుగురు ఉక్రయిన్, ముగ్గురు చైనీస్, ఒక రష్యన్, ఒక నేపాలి, ఒక చైనా సంతతి అమెరికన్‌ను కాల్చిచంపారు.
- కాంగ్రెస్‌తో స్నేహం చేసే ఉబలాటంతోనే జేడీ(యు) ఎన్డీఏ నుండి వైదొలిగిందని బీజేపీ అధ్యక్షుడు రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. 23వ తేదీన పాట్నాలో కార్యకర్తల నుద్దేశించి ప్రసంగిస్తూ ఎన్డీఏతో 17ఏళ్ల బంధాన్ని తెంచుకుని బయటకు పోయేటంత పాపం నరేంద్ర మోడీ ఏం చేసారని ప్రశ్నించారు. ప్రతి పార్టీకి సొంతంగా నిర్ణయాలు తీసుకునే హక్కుంటుందని, మోడీకున్న ప్రజాదరణ దృష్ట్యా తమ పార్టీ ఎన్నికల ప్రచార సారధిగా ఆయనను నియమించామన్నారు.
- కాశ్మీరీ యువతను జాతీయ ప్రధానస్రవంతిలో భాగం చేయాలని గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్రమోడీ పిలుపునిచ్చారు. 23వ తేదీ పంజాబ్‌లోని పఠాన్‌కోట్‌లో జరిగిన జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్‌ముఖర్జీ 60వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ కాశ్మీర్ అంశంలో మాజీప్రధాని వాజ్‌పేయి అసంపూర్తిగా మిగిల్చిన పనిని పూర్తి చేసేందుకు తిరిగి బీజేపీకి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.
- 2013 ఛాంపియన్స్‌ట్రోఫీని భారత్ కైవసం చేసుకుంది. 23వ తేదీ బర్మింగ్‌హోమ్‌లో జరిగిన ఫైనల్‌మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌ను 5పరుగుల తేడాతో చిత్తుచేసి రెండోసారి ఛాంపియన్స్‌ట్రోఫీని చేజిక్కించుకుంది. ఈ ట్రోఫీలో భారత్ ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకపోవడం విశేషం.
- ఉత్తరాఖండ్‌లో వేలాదిమంది నిస్సహాయపౌరుల కోసం సైన్యం చేస్తున్న కృషిని జమ్మూకాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ప్రశంసించారు. సైనికదళాల ప్రత్యేకాధికారుల చట్టంపై నేను సైన్యంతో విభేదిస్తుండొచ్చు... అయితే సైన్యం, వైమానికదళం, ఐటిబిపి ప్రస్తుతం చేపడుతున్న సహాయచర్యలు అద్భుతమని ఆయన తన బ్లాగ్‌లో పేర్కొన్నారు.

## వార్త వ్యాఖ్య

వార్త :- అవి వ్యాపారశాలలు. - ప్రైవేట్ పాఠశాలలపై సీఎం విమర్శ.
వ్యాఖ్య :- *మరి ఆ వ్యాపారశాలలను ప్రోత్సహిస్తున్నది మీరే కదా!*

వార్త :- టీవీ సీరియళ్లు సందేశాత్మకంగా ఉండాలి. - మంత్రి గీతారెడ్డి.
వ్యాఖ్య :- *సందేశాత్మకం ఏమోగాని సాగుతూ మాత్రం వుంటాయి.*

వార్త :- ప్రతిపక్షాల అనైక్యతతోనే ప్రభుత్వ మనుగడ. - బి.వి.రాఘవులు.
వ్యాఖ్య :- *కాదు... ప్రధానప్రతిపక్షంతో వున్న ఐక్యమత్యంతో...*

వార్త :- ఖనిజాలతోనే దేశాభివృద్ధి. - కేంద్ర ఆర్థికమంత్రి చిదంబరం.
వ్యాఖ్య :- *గాలి జనార్థన్‌రెడ్డి లాంటి వారి అభివృద్ధి కూడా!*

వార్త :- దేశాన్ని ఐక్యంగా వుంచే నాయకత్వం కావాలి. - బీజేపీ నేత వెంకయ్య.
వ్యాఖ్య :- *డైరక్ట్‌గా మోడీ నాయకత్వం కావాలని చెప్పొచ్చుగా!*

వార్త :- ప్యాకేజీయే ఇస్తారట. - జేఏసీ నేతలతో కేసీఆర్.
వ్యాఖ్య :- *మీకూ ప్రత్యేక ప్యాకేజీ వుంటుందేమోలే!*

వార్త :- తెలంగాణకు అతిత్వరలోనే పరిష్కారం. - డి.ఎస్.
వ్యాఖ్య :- *అతిత్వరగా అంటే ఓ పదేళ్లు అనుకుందామా?*

వార్త :- తెరాస, కాంగ్రెస్‌లు కలిస్తేనే తెలంగాణ. - కేంద్రమంత్రి సర్వే.
వ్యాఖ్య :- *తెలంగాణ ఇస్తారనే భయంతోనే కదా... కేసీఆర్ కలవంది.*

వార్త :- ఆంధ్రా నీరో కిరణ్‌కుమార్‌రెడ్డి. - వర్ల రామయ్య.
వ్యాఖ్య :- *ఈయనకు ఫిడేల్ వాయించడం రాదే!*

వార్త :- ఒంటరిపోటీకి భాజపా నిర్ణయం.
వ్యాఖ్య :- *జంటగా పోటీకి ఎవరూరారుగా!*

# ఓట్ల వేట

(మొదటిపేజీ తరువాయి)

వారిలోనైనా, అమరనాథ్‌కు వెళ్లే వారిలో నైనా తెలుగువారిదే అగ్రస్థానం. చార్‌ధామ్ యాత్రలోనూ తెలుగు భక్తులదే పైచేయి.

నిన్నటి వరదల్లో ఎక్కువసంఖ్యలో చిక్కుకున్నది కూడా వీళ్లే! గుజరాత్ ముఖ్య మంత్రి నరేంద్రమోడీ స్వయంగా రంగం లోకి దిగి తన రాష్ట్ర యాత్రికులను సొంత ఊర్లకు తరలించడానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకో వడం జరిగింది. కాని మన ముఖ్యమంత్రి నుండి ఆమాత్రం చొరవ కొరవడింది.

ప్రజల సానుభూతి పొందేందుకు ఏ చిన్న అవకాశం దొరికినా రాజకీయ నాయకులు వదులుకోరు. రాష్ట్రంలో అధికారం కోసం వరదల్లో పులిహోర పొట్లం కోసం ఎదురుచూస్తున్న బాధితు డిలా వున్న చంద్రబాబు ఉత్తరాఖండ్ వర దలను బాగానే సద్వినియోగం చేసుకు న్నాడు. యాత్రికులకు సరైన వసతులు కల్పించడం లేదంటూ ఢిల్లీలోని ఏ.పి.భవన్ వద్ద దీక్షచేసి కొంత మద్దతు కూడగట్టాడు. అలాగే డెహ్రాడూన్ నుండి హైదరాబాద్‌కు ప్రత్యేక విమానం పెట్టాడు. వరద బాధితుల సానుభూతి అంతా చంద్రబాబు కొల్లగొడు తున్నాడనే విషయం ఆలస్యంగా తెలుసు కున్న కాంగ్రెస్ నాయకులు వెంటనే ఓ ప్రత్యేక విమానంతో రంగంలోకి దిగారు. తెలుగు యాత్రికుల కోసం డెహ్రాడూన్‌లో వీళ్లు ఒక విమానం పెట్టారు. తెలుగుదేశం నాయకులు ముందుగానే సెలెక్ట్ చేసుకున్న బాధితులను వారి విమానం ఎక్కించబో తుంటే కాంగ్రెస్ ఎంపీ వి.హనుమంతరావు అడ్డుకున్నారు. బాధితులను తమ విమానం ఎక్కించాలని పట్టుబట్టారు. ఇక్కడ కాంగ్రెస్ ఎంపీ విహెచ్‌కూ, తెలుగుదేశం ఎంపీ రమేష్ రాథోడ్‌కు మధ్య తన్నుకున్నంత పనయ్యింది. ఒకర్నొకరు బండబూతులు తిట్టుకున్నారు. శవాల మీద బొగ్గులు ఏరుకునే వీళ్ల చీప్ రాజకీయాలు చూసి, ఈ బురద కంటే వర దలే మేలని బాధితులసహ్యించుకున్నారు.

# పీటముడి

(2వపేజీ తరువాయి)

అధ్యక్షుడిగా కూడా బలహీనవర్గాలకు చెందిన వ్యక్తినే నియమించాలనే అభి ప్రాయం పార్టీలో బలంగా వినపడుతుంది. అయితే ఆ రెండుపార్టీలు బి.సిలను పెట్టాయి కాబట్టి కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడిగా బి.సి.ని పెట్టినా పెద్దగా ఉపయోగం వుండ దని, రెడ్లకే ఇవ్వడం మేలనే అభిప్రాయం లేకపోలేదు. జిల్లా కాంగ్రెస్ పెత్తనాన్నంతా తమ చేతుల్లోకి తీసుకున్న ఆనం సోదరులు తమ కుటుంబం నుండే ఆనం విజయ కుమార్‌రెడ్డిని డీసీసీ అధ్యక్షుడిని చేయాలని భావిస్తున్నారు. అయితే దీనికి ముఖ్యమంత్రి మోకాలడ్డుతున్నట్లు తెలుస్తుంది. డీసీసీ పీఠం బీసీలకే అనే నినాదాన్ని తెరమీదకు తెచ్చారు. ఈ కోణంలోచూస్తే జిల్లా కాంగ్రెస్ లోని ప్రధాన వర్గాలైన ఆనంవాళ్లు తమ అభ్యర్థిగా రాచాల రవికుమార్‌యాదవ్‌ను తెరమీదకు తెస్తున్నారు. ఇక నేదురుమల్లి వర్గం తరపున ఉడతా వెంకట్రావ్, మాగుంట తరపున పి.చెంచలబాబు యాదవ్, పనబాక తరపున సి. హెచ్.హరి బాబుయాదవ్‌లు రంగంలో వున్నారు. అయితే ఎవరు రంగంలో వున్నా, అది ఓసిలకిచ్చినా, బీసీలకిచ్చినా ఆనం సోద రులు చెప్పిన వాళ్లకే డీసీసీ కుర్చీ వస్తుం దన్నది నగ్న సత్యం.

# శిరోభారంగా...

(2వపేజీ తరువాయి)

దానిని కట్టారు. రవిచంద్ర కూడా శక్తి యుక్తులన్నీ ఉపయోగించి పార్టీని నడుపు తున్నాడు. వైకాపాను చూస్తే మొన్నటివరకు కాకాణి గోవర్ధన్‌రెడ్డి నడిపాడు. జిల్లా పార్టీ కార్యాలయం ఖర్చు కూడా ఆయన భరిం చాడు. ఇప్పుడాయన పార్టీ జిల్లా నాయకత్వ బాధ్యతల నుండి తప్పుకున్నాడు. కొత్త కన్వీనర్ మేరిగ మురళీధర్‌కు పార్టీ కార్యక్రమాల ఖర్చును భరించే శక్తిలేదు. ఆయనకు ఆ పదవి ఇప్పించిన నాయకుల వద్ద కోట్లు మూలుగుతున్నా దమ్మిడీ బయ టకు తీయరు. కాబట్టి మున్ముందు ఎవరి నియోజకవర్గాలలో వాళ్లు పార్టీ కార్యక్ర మాలు నిర్వహించుకోవాల్సింది తప్పితే జిల్లాస్థాయి పార్టీ కార్యక్రమాలు నిర్వహిం చాలంటే కష్టమే. బీజేపీ, సీపీఎం, సీపీఐ పార్టీల జిల్లా నాయకత్వాలకు ఈ సమస్య పెద్దగా వుండదు. ఎందుకంటే వారి కార్య క్రమాలు ఒక స్థాయికే పరిమితమై వుంటాయి. కాబట్టి పెద్ద ఖర్చుండదు.

తెలుగు దేశం, వైకాపా జిల్లా నాయ కత్వాలు మాత్రం ఆర్థికంగా సవాలే! పార్టీని నడపాలంటే ప్రతి నిముషం రూపాయితో పనే! ఈ ఆర్థికభారంతోనే పార్టీల జిల్లా అధ్యక్ష బాధ్యతలపై నేతలు విముఖత వ్యక్తం.చేస్తుంటారు.

# కోట్లుంటేనే..

(మొదటిపేజీ తరువాయి)


వుంది కాబట్టి ఆర్థికంగా వున్న అభ్యర్థులకు కొరత లేదు. వైకాపా జగన్ ఇమేజ్‌ను, వై.యస్. సానుభూతిని నమ్ముకుంది. ఏ ఇమేజ్‌గాని, సానుభూతిగాని, అధికారం గాని లేనిది తెలుగుదేశంకే! కేవలం పచ్చ నోట్ల మీదే ఎలక్షన్ చేయాలి. 294అసెం బ్లీలలో రిజర్వుడ్ స్థానాలు పక్కనపెడితే మిగతా స్థానాలలో కోట్లున్నవారినే దించాలి. 42లోక్‌సభ స్థానాల పరిస్థితి కూడా అంతే! కాని ఇన్ని స్థానాలకు కోటీశ్వ రులు దొరుకుతారా? ఇప్పటికే చాలా మంది తెలుగుదేశాన్ని వదిలి వెళ్లారు. ఇప్పుడు కోట్లకు వున్నోళ్లు కూడా తెలుగుదేశం సీట్ల కోసం ఎగబడే పరిస్థితి లేదు. కాబట్టి అభ్యర్థుల ఎంపిక చంద్రబాబుకు పెద్ద సవాలే కాగలదు.

# భారం ఆమెదే!

(మొదటిపేజీ తరువాయి)

బయటకొచ్చింది. తన మరోబిడ్డ షర్మిలను పాదయాత్రతో ప్రజల మధ్యకు పంపింది. తాను సైతం ప్రజల మధ్య తిరుగుతుంది. విజయమ్మ ప్రజల మధ్య తిరుగుతుండ డంతో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రమే మారిపోతుంది. ముఖ్యంగా ఆమె తెలం గాణ మీద ఎక్కువగా దృష్టి పెట్టింది. తెలంగాణలో ఆమెకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారు. ఆమె పట్ల జనాదరణ చూసి తెలంగాణ సెంటిమెంట్‌ను నమ్ముకుని రాజకీయంగా బ్రతుకీడుస్తున్న కేసీఆర్‌కు కడుపు మండుతోంది. విజయమ్మ ఇదే విధంగా తెలంగాణ అంతటా తిరిగితే టీఆర్ఎస్ హవాకు బ్రేకులు పడడం ఖాయం. జగన్ జైలులో వున్నాడు. ఎప్పుడు బయట కొస్తాడో చెప్పలేని పరిస్థితి. ఇప్పటికీ పార్టీ భారాన్ని తన భుజస్కంధాల మీద వేసుకుని మోస్తుంది విజయమ్మ. రాష్ట్రంలో స్థానిక ఎన్నికల సంగ్రామం మొదలైంది. పంచాయితీలు, మున్సి పాల్టీలు, జడ్పీలు... వరుసగా ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికలతోనే జైత్ర యాత్రను మొదలుపెట్టాలని విజయమ్మ భావిస్తుంది. పార్టీ శ్రేణులను ఆ దిశగా సిద్ధం చేస్తుంది. పార్టీ కేడర్‌లో ఎన్నికల సమరోత్సాహం నింపేవిధంగా ఆమె ప్రసంగాలుంటున్నాయి. జగన్ బయట లేని లోటు ఏ మాత్రం కనపడనీయకుండా విజయమ్మ పార్టీని ప్రజల ముందుకు తీసు కెళ్లడంలో విజయం సాధించింది. రేపు ఎన్నికల విజయమే సాధించాల్సివుంది.

ఫంగస్, చేపల
రైతులకు గొప్ప అవకాశం
చేపల మేత 1 Kg. రూ. 22
(పిల్లెట్) ప్రోటీన్ 23%
జాబ్‌వర్క్ కూడా చేయబడును
గోల్డెన్ ఫీడ్స్ పెద్దపడుగుపాడు నెల్లూరు.
సం. 08622-258596 9440279762





## నెల్లూరు కబుర్లు
## జంట మంత్రుల సందడి!

రాష్ట్ర మంత్రివర్గంలో అతికీలకమైన శాఖలు (రెవెన్యూ, ఆర్థిక) నిర్వహిస్తున్న మంత్రులు ఎన్.రఘువీరారెడ్డి, ఆనం రామనారాయణరెడ్డిలు 25వ తేదీ జిల్లాలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. నాయుడుపేటలో ఆర్డీవో కార్యాలయాన్ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం చిల్లకూరు జంక్షన్‌లో గూడూరు మెయిన్‌రోడ్డును ప్రారంభించారు. నెల్లూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఇంట్లో భోజనం అనంతరం ఆత్మకూరుకు వెళ్లారు. అక్కడ ఆర్డీవో కార్యాలయాన్ని ప్రారంభించారు. మర్రిపాడు, గూడూరు మండలాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు ప్రారంభించారు. మంత్రి సొంత నియోజకవర్గం కావడంతో ఇక్కడ మంత్రులకు ఘనస్వాగతం లభించింది.

## ఆత్మకూరు ఇన్‌ఛార్జ్ ఆర్డీవోగా మాధవీలత



కొత్తగా ఏర్పాటైన ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌కు నెల్లూరు ఆర్డీవో మాధవీలతనే ఇన్‌ఛార్జ్ ఆర్డీవోగా వ్యవహరించనున్నారు. 25వ తేదీన ఈ రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని రెవెన్యూ మంత్రి రఘువీరారెడ్డి ప్రారంభించారు. ఇక్కడ ఇంకా పూర్తి స్థాయి ఆర్డీవోను నియమించలేదు. కొత్త ఆర్డీవోను నియమించేవరకు మాధవీలత ఇన్‌ఛార్జ్‌గా వుంటారు.

## అపోలో ఆసుపత్రిలో
## క్యాన్సర్‌కు రోబోటిక్ సర్జరీ

- డా॥వెంకటేష్ మునికృష్ణన్

చెన్నై అపోలో ఆసుపత్రిలో రోబోటిక్ సర్జరీ ద్వారా కోలోరెక్టల్ క్యాన్సర్‌ను తొలగించవచ్చని ప్రముఖ కోలోప్రాక్టలజీ వైద్యనిపుణులు డా॥వెంకటేష్ మునికృష్ణన్ తెలిపారు. ఆదివారం నెల్లూరు అపోలో సమాచార కేంద్రంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కోలోరెక్టల్(బౌల్) క్యాన్సర్‌వ్యాధి ప్రపంచంలో ప్రస్తుతం మహిళలకంటే పురుషుల్లో అధికంగా ఉందన్నారు. ఈ వ్యాధిపై అవగాహన లేకుంటే ప్రమాదకరమన్నారు. ఫైల్స్‌తో బాధపడేవారు తొలిదశలోనే సరైన చికిత్స చేసుకోకుంటే కోలోరెక్టల్ క్యాన్సర్‌గా మారే ప్రమాదముందన్నారు. రక్తహీనత, ఆహార్య అలవాట్లు మారటం, మలంలో రక్తం కనపడటం, కడుపులో వికారం, మత్తుగా ఉండటం, తూలి పోవడం, కారణంలేకుండానే బరువు తగ్గిపోవడం వంటి లక్షణాలు ఉన్న వారంతా కోలోరెక్టల్ క్యాన్సర్ బారిన పడే అవకాశముందన్నారు. అత్యాధునిక పరికరం రోబోటిక్ పరికరం ద్వారా రోగికి ఎటువంటి కోతలు, రక్తస్రావం లేకుండా శస్త్ర చికిత్సను నిర్వహిస్తామని మూడోరోజే డిశ్చార్జి కావచ్చన్నారు. ఈ సమావేశంలో నెల్లూరు అపోలో సమాచారకేంద్రం నిర్వాహకులు డా॥నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

## మద్యం దుకాణాలకు నోటిఫికేషన్

జిల్లాలో ఖాళీగావున్న 19మద్యం దుకాణాలను లాటరీ ద్వారా కేటాయించేందుకు నెల్లూరు ఎక్సైజ్ శాఖ 25వ తేదీన నోటిఫికేషన్ విడుదల చేసింది. 2012-13 సంవత్సరానికి జిల్లాలోని 348 మద్యం దుకాణాలకు నోటిఫికేషన్ విడుదల చేయగా వాటిలో 19దుకాణాలకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు. ఈ దుకాణాల కేటాయింపుకు మళ్ళీ ఒకటికి రెండుసార్లు టెండర్లు పిలిచినా ఫలితం లేకుండాపోయింది. వీటిలో కొన్ని దుకాణాల సెంటర్లను మార్పుచేసి తాజాగా నోటిఫికేషన్ విడుదల చేశారు. జూలై 1వ తేదీ సాయంత్రం 5గంటలలోపు వ్యాపారులు దరఖాస్తులను నెల్లూరు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో అందజేయాలి. 2వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు కలెక్టర్ సమక్షంలో లాటరీతీసి, అందులో వచ్చిన వారికి ప్రొవిజనల్ లైసెన్స్‌లు మంజూరు చేస్తారు.

## చార్‌ధామ్ మృతులకు యూత్ చేయూత

ఉత్తరాఖండ్ చార్‌దామ్ వరద మృతులకు 22వ తేదీ సాయంత్రం నెల్లూరు పార్లమెంటు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. నెల్లూరు నగరంలోని ఏసిసెంటర్ కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవికుమార్‌యాదవ్ నేతృత్వంలో యూత్ కాంగ్రెస్ నాయకులు మృతులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ యూత్ కాంగ్రెస్ తరపున మృతుల కుటుంబాలకు 20వేలు విరాళాన్ని చెక్కు రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కా[illegible]ంలో యూత్ కాంగ్రెస్ పార్లమెంటు అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, గ్రామీణ అధ్య[illegible]డు మేఘనాథ్‌సింగ్, యశ్వంత్‌సింగ్, నిరంజన్, కేతంరెడ్డి వినోద్‌రెడ్డి పలువురు యూత్‌కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎస్పీపై వివేకా ఫైర్



జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్ పనితీరుపై నెల్లూరురూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి గతంలోనే పలుమార్లు విరుచుకుపడ్డారు. బహిరంగంగానే విమర్శలకు దిగారు. తాజాగా మొన్న హైదరాబాద్‌లో సీఎం వద్ద జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో ఎస్పీపై వివేకా ఫైర్ అయినట్లు తెలిసింది. జిల్లాలో హత్యలు, దొంగతనాలకు అంతు లేకుండాపోతుంది. పోలీసింగ్ అనేదే లేకుండా పోయింది. రాజకీయ కోణంతో సమస్యను చూడొద్దు. నేను నాకు పనులు చేసే అధికారిని వేయమని అడగడంలేదు. ప్రజలకు పనిచేసే ఎస్పీని వేయండి... అని వివేకా సీఎంను కోరాడని సమాచారం.

## తెలుగు నాయకురాలిపై కేసు

జిల్లా తెలుగుదేశంపార్టీ మహిళా అధ్యక్షురాలు అంచలవాణి, ఆమె భర్త గణపతిలపై నెల్లూరు నాలుగోనగర పోలీసుస్టేషన్‌లో దౌర్జన్యం, దొమ్మి, అక్రమ ప్రవేశం కేసులను నమోదు చేసారు. హరనాథపురం 4వ వీధిలో ఓ సివిల్ కేసుకు సంబంధించి వాణి, ఆమె భర్త దౌర్జన్యంగా వ్యవహరించడంతో బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు పెట్టారు.

## ఎస్పీ సిసిగా శ్రీనివాసరావు

జిల్లా ఎస్పీ కార్యాలయం క్యాంప్ క్లర్క్‌గా దారా శ్రీనివాసరావును నియమించారు. ఈయన పోలీసు కార్యాలయంలో బి-3 విభాగంలో పని చేస్తున్నారు. ఇప్పటివరకు సిసిగా వున్న కృష్ణమూర్తిని పోలీసు కార్యాలయంలోని పి-2 విభాగానికి బదిలీచేశారు.

## లయన్స్‌క్లబ్ పినాకిని కొత్త కార్యవ

లయన్స్‌క్లబ్ ఆఫ్ నెల్లూరు పినాకిని 2013 సంవత్సరానికి కొత్త కార్యవర్గాన్ని సోమవారం నె రంగనాయకులపేటలోని ఆర్యవైశ్య బులియన్ మర్చ అసోసియేషన్ భవనంలో ఎన్నుకున్నారు.

అధ్యక్షునిగా బి.పార్థసారథి, కార్యదర్శిగా ఐ ప్రసాద్, కోశాధికారిగా టి.వి.రాంప్రసాద్, లియో ఆఫ్ నెల్లూరు పినాకిని అధ్యక్షునిగా జి.నితిన్, దర్శిగా సి.హర్షిప్, కోశాధికారిగా ఎన్.తేజస్వ లను ఎన్నుకున్నారు.

## ఐఎన్‌టియుసి అధ్యక్షుడిగా ము

కాంగ్రెస్ అనుబంధ కార్మిక సంస్థ ఐఎన్‌టీ జిల్లా అధ్యక్షుడిగా కొమారి మురళిని నియమిస్తూ అధ్యక్షులు మిద్దెల జితేంద్ర ఉత్తర్వులు జారీచేసి మురళీ చిరంజీవికి వీరాభిమాని. ముంగమూ అనుచరుడు. తనకు ఈ పదవి ఇప్పించిన వ ఆనం రామనారాయణరెడ్డికి, ఎమ్మెల్యేలు ఆనం వి నందరెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, ఎ వాకాటి నారాయణరెడ్డికి మురళీ కృతజ్ఞతలు తెలి



PDF Compressor Free Version



# జిల్లాకు అదనపు రెవెన్యూ సొకులు



- ఆత్మకూరు, నాయుడుపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయాలను ప్రారంభించిన రెవెన్యూ, ఆర్థికశాఖమాత్యులు


నాయుడుపేట ఆర్డీవో కార్యాలయానికి ప్రారంభోత్సవం

ప్రస్తుతం రాష్ట్రంలో 81 రెవెన్యూ డివిజన్‌లు వుండగా పరిపాలనా సౌలభ్యం కోసం కొత్తగా మరో 10రెవెన్యూ డివిజన్‌లను ఏర్పాటు చేయడం జరిగింది. వీటిలో రెండు డివిజన్‌లు నెల్లూరుజిల్లాలోనే ఏర్పాటు కావడం గమనార్హం. దీని వెనుక జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి ఎంతుందనేది ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు. నాయుడుపేట, ఆత్మకూరు కేంద్రాలుగా ఏర్పాటైన ఈ రెండు రెవెన్యూ డివిజన్‌లను 25వ తేదీ రెవెన్యూ మంత్రి రఘువీరారెడ్డి, ఆర్థికమంత్రి ఆనం రామనారాయణరెడ్డిలు ప్రారంభించారు. మొదట మంత్రులు నాయుడుపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయం ప్రారంభించారు. ఇక్కడ సభలో మంత్రులిద్దరూ తమ ప్రభుత్వం చేసిన గొప్పపనులు చెప్తూకున్నారు. అవి శ్రుతిమించి రాజకీయ ప్రసంగాలుగా మారేసరికి స్థానిక ఎమ్మెల్యే పరసా రత్నం అభ్యంతరం చెప్పారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
- సరికొత్త ప్రపంచస్థాయి మోడల్స్
- ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.


సభలో ప్రసంగిస్తున్న మంత్రి రఘువీరారెడ్డి

నాయుడుపేట కార్యక్రమానికి జనం కూడా చాలా పలచగానే హాజరయ్యారు. సాయంత్రం ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ కార్యాలయ ప్రారంభోత్సవానికి మాత్రం జనం దండిగానే వచ్చారు. ఆత్మకూరు, ఏ.ఎస్.పేట, అనంతసాగరం, చేజర్ల, సంగం, వింజమూరు, మర్రిపాడు మండలాల నుండి ప్రజలను భారీగా తరలించారు. ఈ సభలో ఆత్మకూరు అభివృద్ధి కోసం తానేం చేస్తున్నది ఆనం రామనారాయణరెడ్డి చెప్పుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఎంపీ చింతా మోహన్, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు పరసా రత్నం, కురుగొండ్ల రామకృష్ణ, డీసీసీబీ ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, డీసీఎంఎస్ ఛైర్మన్ సుమంత్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులు పసబాక కృష్ణయ్య, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కంభం విజయరామిరెడ్డి, తాళ్లూరి రమణయ్యనాయుడు, చెన్ను బాలకృష్ణారెడ్డి, కలెక్టర్ బి.శ్రీధర్, జేసీ బి.లక్ష్మీకాంతం, ఏజేసీ పెంచలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## సరస్వతినిధితో ఆదుకోండి

### కలెక్టర్‌కు విన్నవించుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు

సరస్వతినిధి ద్వారా తమ పిల్లలను ఆదుకోవాలని పలువురు జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్‌ను కలసి వేడుకున్నారు. కష్టపడి తమ పిల్లలను పదవ తరగతి వరకు చదివించామని, ఇక చదివించేందుకు ఆర్థిక స్థోమతలేదని, సరస్వతినిధి ద్వారా ఆదుకోవాలని కలెక్టర్‌ను అభ్యర్థించారు. సోమవారం గ్రీవెన్స్‌డే కార్యక్రమానికి పలువురు తల్లిదండ్రులు తమ పిల్లలతో కలసి కలెక్టర్ కార్యాలయానికి తరలివచ్చారు. వీడియోకాన్ఫరెన్స్ ముగించుకుని వస్తున్న కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. దీనికి చలించిన కలెక్టర్ వారి వివరాలను తీసుకోవాలని సీసీని ఆదేశించారు. అవకాశమున్నంత వరకు సహకరిస్తామని వారికి కలెక్టర్ హామీ ఇచ్చారు.

## పెంచలకోనకు కొత్త పాలకమండలి



నెల్లూరుజిల్లా రాజకీయాలతో వాయిదాలుపడుతూ వస్తున్న పెంచలకోన శ్రీ పెనుశిలనృసింహస్వామి దేవస్థానం నూతన పాలకమండలి నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈమేరకు రాష్ట్ర దేవాదాయశాఖ కమీషనర్ కార్యాలయం నుంచి జీవో విడుదలైంది. పాత పాలకమండలి పదవీకాలం గత ఏడాది అక్టోబర్‌కు ముగిసింది. కాని జిల్లా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మాజీమంత్రి నేదురుమల్లి రాజ్యలక్ష్మి మధ్య పోటీ పడుతూ చివరకు ఆనందే పైచేయి అయింది. ఆనంవర్గంవారి పేర్లనే దేవాదాయశాఖ కమీషనర్ కార్యాలయం ఖాయం చేస్తూ జీవో జారీచేసింది. నూతన పాలకమండలిలో ఛైర్మన్ పదవి చెన్ను తిరుపాల్‌రెడ్డిని వరించింది. ఈమేరకు ఆయన బుధవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణస్వీకారం చేశారు.

ఆయనతో పాటు చీమకుర్తి శంకర ప్రసాద్(పొదలకూరు), మోదేపల్లి చంద్రావతి(చిత్తలూరు), మన్నారపు రవికుమార్(సైదాపురం), దుంపా రమణారెడ్డి(దాచూరు), బండి తిరుపాల్‌రెడ్డి(పెనుబర్తి), రేవూరు రామచంద్రయ్య(రాపూరు), చెలికం భాస్కర్‌రెడ్డి (దక్కిలి), యర్రంశెట్టి మస్తాన్ రాయులు(చిట్వేల్), గుండ్లూరు సీతారామయ్య (ఎక్స్‌అఫిషియో సభ్యులు) సభ్యులుగా ప్రమాణస్వీకారం చేయడం జరిగింది.

PDF Compressor Free Version



## కదంబం

## కడలి

డి.ప్రసూనశరత్,
పొదలకూరు, 94416 99585.



నమ్మకానికి ప్రతీకగా
తరాల దారుల్లో
పయనించే వంశధార నాన్న
అమ్మ ఆశలు చిగురించేలా
నిత్యం కురుస్తున్న తేనెజల్లు నాన్న
ఎదుగుతున్న చిరుమొగ్గల
భావోద్వేగపు వికాసాన్ని
కాచి రక్షించే కంచె నాన్న
అంతరంగంలో
ఆలోచనా రత్నరాశులను
యిముడ్చుకొని
ఆటుపోట్ల మధ్యనలిగే
నిండైన కడలి నాన్న
ఒక్కొక్కసారి గర్జించినా
అప్పుడప్పుడూ గాండ్రించినా
అనుబంధపు సమీరాలకు
కరిగిపోయి కురిసే కారుమేఘం నాన్న
నాన్న నా అనే ధీమాకు అసలైన చిరునామా

## ఆంధ్రా అసెంబ్లీ సమావేశాలవల్లే ఉత్తరాఖండ్ ఉపద్రవం

### గల్పిక

అది వైకుంఠంలోని 'మోక్షమార్గ' కాన్ఫరెన్స్ హాల్. శ్రీ మహావిష్ణువుతో పాటు పరమశివుడు, బ్రహ్మ, ఇంద్రుడు, యముడు వంటి దేవాధిపతులందరూ అక్కడ హాజరైవున్నారు. అక్కడ వేదిక మీద దేవలోక బీబీసీ నారద మహర్షి మైకు ద్వారా వస్తున్న దేవలోకాధిపతులందరినీ సాదరంగా ఆహ్వానిస్తున్నాడు. కొద్దిసేపటి తర్వాత బ్రహ్మ వుండి... నారదా, ఎమర్జెన్సీ మీటింగ్ అని సెల్ మెసేజ్ పెట్టి అందర్నీ పిలిపించావు... కారణమేంటో చెప్పు... అవతల నాకు చాలా అపాయింట్‌మెంట్స్ వున్నాయన్నాడు. దానికి నారదుడు... నాకేం పనీపాటా లేదనుకుంటున్నారా తండ్రీ... నాకూ బోలెడు అగ్గిపుల్లలు గీసే పనులున్నాయి. విష్ణుమూర్తిగారు ఏదో విషయం మీద చలించిపోయి ఈ మీటింగ్ పెట్టమని నన్ను ఆదేశించారు. ఆయన మాట ప్రకారమే నేను అందరికీ మెసేజ్‌లు పెట్టాను అని చెప్పాడు. అప్పుడు యముడు, ఇంద్రుడు కంబైన్డ్‌గా లేచి... మీకు పనులున్నాయో, ఖాళీగా వున్నారో తర్వాత మాట్లాడుకుందాం... మాకవతల క్షణం తీరికలేని బిజీ వుంది. ఉత్తరాఖండ్‌లో వరదలు వచ్చి వేలమంది మా లోకాలకు వస్తున్నారు. వాళ్లలో ఎవరిని ఏ లోకానికి పంపించాలనేదానిమీద బ్రూటీన్ నిర్వహిస్తున్నాం. ఒకేసారి ఇంతమంది చనిపోవడంతో మాకు పని ఒత్తిడి పెరిగింది. స్టాఫ్‌ను పెంచుకుందామంటే ఈ పనులు చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. మా సీట్లు గాని ఇచ్చే పనయితే వచ్చేటట్లున్నారు అని చెప్పారు.

అప్పుడు విష్ణుమూర్తి మైకందుకుని అక్కడే వున్న టీవీ ఆన్‌చేసి టీవీ 10.5 ఛానెల్ పెట్టాడు. అందులో ఉత్తరాఖండ్ వరదలు, బురదలో కూరుకుపోయిన దేవాలయాలు, శవాలగుట్టలు, కోసుకుపోయిన రహదారులు, గంగానది ఉగ్రరూపం వంటి దృశ్యాలు రాసాగాయి. విష్ణుమూర్తి వాటిని చూపిస్తూ... చూసారా, ఈ దృశ్యాలు ఎంత హృదయవిదారకంగా వున్నాయో... మనిషికి చావు పుట్టుక సహజమేనని చెప్పిన నేనే ఈ దృశ్యాలను చూడలేకపోతున్నాను. వాళ్లు దేవుడున్నాడని చెప్పి భక్తితో వేలకిలోమీటర్లు ప్రయాణం చేసి మనం కొలువైవున్న పుణ్యక్షేత్రం సందర్శనకు వస్తారు. అలాంటి భక్తులను ఎటువంటి కష్టాల పాల్జేయకుండా తిరిగి గమ్యస్థానాలు చేర్చాల్సిన బాధ్యత మనదే! మనల్ని దర్శించుకున్నాక వారి జీవితాలలో ఆనందం నిండాలి, అప్పుడే మనం వున్నామనే నమ్మకం వారిలో పెరుగుతుంది. మనల్ని చూడడానికి వచ్చి వాళ్లు కష్టాల్లో పడితే ఇక మనల్నేం నమ్ముతారు. అసలు ఈ ఉత్తరాఖండ్ ఉపద్రవం ఎందుకు వచ్చింది. దీనికి కారణమెవరు? నాకు ఇప్పుడే ఇక్కడే తెలియాలి అని ప్రశ్నించాడు. దానికి కారణం నేనే... అనే మాట ఆ సభలో నుండి వినిపించింది. ఎవరా ఆ మాట అన్నది అని అందరూ అటువైపు చూసారు. ఆ మాటన్నది పరమశివుడు. ఆయన కళ్లల్లో నుండి కన్నీళ్లు ఉబికివస్తున్నాయి. విష్ణుమూర్తి వుండి... శివా... నీవల్ల జరిగిందా? ఎలా? అని ఆశ్చర్యంగా ప్రశ్నించాడు. చెబుతాను విష్ణు చెబుతాను... శ్మశాన సంచారిని... ఈ ఘోర దృశ్యాలు చూస్తుంటే నాకే గుండె రగిలిపోతుంది. అసలేం జరిగిందంటే... అని టార్టాయిస్ కాయిల్‌ను అందరి ముందు పెట్టి గిర్రున తిప్పి ఫ్లాష్‌బ్యాక్‌లోకి తీసుకెళ్లాడు.

★★★★★

అది కైలాసం. శివుడు భోంచేసి వచ్చి టీవీ ముందు కూర్చున్నాడు. ఆయన పక్కన అటు పార్వతీదేవి, ఇటు గంగాదేవి కూర్చున్నారు. ఆ సమయంలో ఆయన ఎడమకన్ను ఎందుకో అదిరింది. అయినా పట్టించుకోలేదు. పార్వతీదేవి వుండి... స్వామి... జెమిని టీవీలో "మొగుడి కేకలు" సీరియల్ వచ్చే టైమయ్యింది... ఒక్క ఎపిసోడ్ మిస్సయినా నాకు ఏదో వెలితిగా వుంటుంది. ఆ సీరియల్ పెట్టండి స్వామి అని అడిగింది. వెంటనే గంగాదేవి... నాథా, ఈ టీవీలో 'కత్తిపెళ్లాం... సుత్తిమొగుడు' సీరియల్ వచ్చే టైమయ్యింది... నాకు ఆ సీరియల్ అంటే ఇష్టం... ముందు ఈ టీవీనే పెట్టండి అని అడిగింది. లేదు ముందు జెమిని టీవీనే పెట్టండి అని పార్వతీదేవి... లేదు ఈటీవీనే పెట్టండని గంగమ్మ... వాదులాటపడ్డారు. వారి దెబ్బకు శివుడికి 'నారీనారీ నడుమ మురారి' సినిమాలోని 'ఇరువురి భామల కౌగిలిలో స్వామి ఇరుకున పడి నీవు నలిగితివా' అనే పాట పాడుకోవాలనిపించింది. అయినా పూర్తి పాట రాక వద్దనుకున్నాడు. తర్వాత ఆయనే కలుగజేసుకుని... మనకుండేది ఒక టీవీ... ఒకే టైంలో మీరిద్దరూ సీరియల్స్ చూడడం కష్టమే... కాబట్టి భర్తగా నా మాటను గౌరవించండి... నాకిష్టమైన ఛానెల్ పెట్టుకుంటాను... మీరు కూడా ఆ ఛానెల్ కార్యక్రమాలు చూసి ఆనందించండని కోరాడు. దానికి ఇద్దరూ అంగీకరించడంతో శివుడు 10.5ఛానెల్ పెట్టాడు. అందులో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రత్యక్షప్రసారమవుతున్నాయి. స్పీకర్ స్థానంలో నాదెండ్ల మనోహర్ కూర్చునివున్నాడు. సీఎం కిరణ్‌తో పాటు మంత్రులు, అన్ని పార్టీల ఎమ్మెల్యేలు వచ్చి తమ స్థానాలలో కూర్చుంటున్నారు. అంతలో స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి(63) లోపలకు వచ్చాడు. వస్తూ వస్తూ... దారిలో వున్న వాళ్లందరి కాళ్లు తొక్కుకుంటూ వచ్చాడు. ఆయన తొక్కుడుకు అబ్బా... అని అందరూ కేకలు పెడుతుంటే, ఇంకా సమావేశం మొదలుకాకముందే ఈ పాడురచ్చ ఏంటని వివేకానే అడిగాడు. తర్వాత ఆయనే స్పీకర్‌ను ఉద్దేశించి... అధ్యక్షా... ఇదేం అన్యాయం అధ్యక్షా... రాష్ట్రంలో అంటే కరెంట్ కోతలు సరే... అసెంబ్లీలో కూడా కరెంట్ కోతేనా... కనీసం రెండు లైట్లన్నా వేసుండకూడదా... ఈ చీకటిలో సమావేశాలేంటి... అని స్పీకర్ తూర్పు వైపుంటే ఈయన దక్షిణంవైపు ముఖంపెట్టి అడగసాగాడు. అప్పుడు స్పీకర్ నాదెండ్ల... వివేకా గారు... హాల్‌లో లైట్లు వెలుగుతూనే వున్నాయి. ముందు మీరు ఆ కళ్లకున్న నల్లద్దాలు తీయండి అని చెప్పాడు. అప్పుడు వివేకా కళ్లకున్న అద్దాలు తీయడంతో ఆయనకు విషయం అర్థమైంది. తర్వాత స్పీకర్ చర్చకు ఆదేశించాడు. వెంటనే రేవంత్ పైకిలేచి... అధ్యక్షా... 'బంగారుతల్లి', 'వెండిచెల్లి', 'ఇత్తడి బల్లి'... ఏంటీ పథకాలు... పేరు గొప్ప ఊరుదిబ్బ అన్నట్లుగా వున్నాయి. సీఎం చెబుతున్నంత గొప్పగా పథకాలు అమలు కావడం లేదన్నాడు. దానికి సీఎం కిరణ్ లేచి... మీ చంద్రబాబు గారికంటే నేను మంచి పథకాలే పెట్టాను. ఆయన జన్మభూమి అంటూ రాష్ట్రాన్ని మరుభూమిగా మార్చాడని విమర్శించారు. అప్పుడు హరీష్‌రావు లేచి... మీ బంగారుతల్లి... ఇత్తడి బల్లి గురించి ఆపండి... మా తెలంగాణ లొల్లి గురించి ఏమనుకుంటున్నారు. తెలంగాణపై ఇప్పటికిప్పుడు తీర్మానం చేయకుంటే సభనే జరగనివ్వం... అంటూ పోడియం ముందు బైఠాయించాడు. తెలంగాణ ఎమ్మెల్యేలు ఆయనతో కలిసి కూర్చున్నారు. ఇంకోపక్క 'బంగారుతల్లి' పథకాన్ని కాంగ్రెస్ తల్లులకే పరిమితం చేస్తున్నారని, తెలుగుదేశం తల్లులకు ఇవ్వడం లేదని చంద్రబాబు ఆరోపించాడు. దీంతో ప్రతిపక్ష, అధికారపక్ష సభ్యుల మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. ఒకరిపైకి ఒకరు కాగితాలు, ఫైళ్లు, మైకులు విసురుకున్నారు. కొందరు బల్లలెక్కి డ్యాన్స్‌లు చేయసాగారు. కొద్ది క్షణాలలోనే సభ కిష్కింధకాండను తలపించసాగింది. ఎమ్మెల్యేలు ఒకర్నొకరు కలబడి కొట్టుకోసాగారు.

టీవీలో ఈ హర్రర్ దృశ్యాలు చూసేసరికి సున్నితమనస్కురాలైన పార్వతీదేవి కళ్లుతిరిగి పడిపోయింది. 'కత్తిపెళ్లాం - సుత్తిమొగుడు' వంటి మంచి సీరియల్‌ను వదిలేసి నాకు ఈ చెత్త ప్రోగ్రామ్ చూపిస్తావా అంటూ గంగమ్మ శివయ్యపై శివాలెత్తింది. అదే ఉగ్రరూపంతో బయటకెళ్లి పోయింది. ఆ కోపాన్ని ఉత్తరాఖండ్ వరదల రూపంలో చూపించింది.

ఇక్కడితో ఫ్లాష్‌బ్యాక్ ముగిసింది. అందరూ శివయ్యతో... తప్పు ఆంధ్రా అసెంబ్లీదైనా అన్యాయం జరిగింది మాత్రం మన భక్తులకే... ఇక నుండైనా ఆ పాడు ఆంధ్రాఅసెంబ్లీ సమావేశాలు చూడకుండా వుండండి అని శివయ్యకు చెప్పి అందరూ ఎవరి బాట వాళ్లు పట్టారు.

★★★★★

సంగీత, నృత్య పాఠశాలలో

## ప్రవేశానికి ఆహ్వానం

నెల్లూరు నగరంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నెల్లూరు ప్రభుత్వ సంగీత, నృత్యపాఠశాలలో సంగీతం, నృత్యం అభ్యసించదలచుకున్న అభ్యర్థులనుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ సి.మునికుమార్ తెలిపారు. గాత్రం, వయోలిన్, వీణ, భరతనాట్యం, మృదంగం ఫ్లూట్ కోర్సులలో నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్సు, రెండు సంవత్సరాల డిప్లొమాకోర్సు అందిస్తున్నట్లు తెలిపారు. 8సంవత్సరాలు నిండిన అభ్యర్థులు వయోపరిమితి లేకుండా సంగీతం, నృత్యం అభ్యసించవచ్చన్నారు. విద్యార్థులు, ఉద్యోగులు, గృహిణులకు అనుకూలంగా ఉదయం, సాయంత్రం సమయాల్లో మాత్రం సంగీతం, నృత్యం నేర్పిస్తామన్నారు. సంవత్సరానికి నామమాత్రపు ఫీజు 500లు చెల్లించాల్సి ఉందన్నారు. దరఖాస్తు వెల 25రూ॥లు చెల్లించాలన్నారు. ఆఫీసు పనివేళల్లో అడ్మిషన్ పొందవచ్చన్నారు. ఇతర వివరాలకు 0861-2328286ఫోన్ నంబరులో సంప్రదించవచ్చన్నారు.

## ఐఏఎస్ స్టడీసర్కిల్ ఏర్పాటుకు విజ్ఞప్తి

నెల్లూరు కొండాయపాలెంగేట్ వద్దగల డా॥బిఆర్ అంబేద్కర్ భవన్‌లో ఈనెల 23న ఆంధ్రప్రదేశ్ దళిత విద్యార్థిసేన, అంబేద్కర్ స్టడీసర్కిల్‌లు సంయుక్తంగా సమావేశమై ఐఏఎస్ స్టడీసర్కిల్ ఏర్పాటుకాక దళిత, బహుజన విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను వెలుగెత్తి చాటారు. ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఇందుకోసం కోటి రూపాయలు నిధులు మంజూరు చేసినా స్టడీ సర్కిల్ ఏర్పాటుకాకపోవడం విస్మయానికి గురిచేస్తుందన్నారు. దయవుంచి జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ స్పందించి స్టడీసర్కిల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేసారు. ఈనెల 30న జరిగే స్టడీసర్కిల్ చైతన్య సదస్సులో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయమని కోరారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దళిత విద్యార్థిసేన జిల్లా అధ్యక్షులు అరవపూర్ణప్రకాష్, జె.ప్రేమ్‌సన్, ఎస్.పోలయ్య, జె.జాన్సన్, పి.వెంకటేశ్వర్లు, యం.నాగరాజారావు, ఫంకస్, నారాయణ, ఇ.రత్నం, కె.లీలావతి, యం.రహీలమ్మ, సి.హెచ్.దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

## 'కేతా' ఉచిత హోమియోపతి వైద్యశిబిరం

నెల్లూరు సుబేదారుపేటలోని నగరపాలక పాఠశాల ఆవరణలో ఈనెల 23న కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయిదుర్గ హోమియో క్యూర్ వైద్య నిపుణులు డా॥ ఎం.రమ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత నివారణ హోమియోపతిలో వుందని పేర్కొన్నారు. అయితే వ్యాధి తీవ్రతను గుర్తించి వ్యాధిని సమూలంగా నివారించేందుకు క్రమం తప్పకుండా హోమియోపతి వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడినప్పుడే సత్ఫలితాలుంటాయని తెలిపారు. శిబిరంలో వృద్ధులు, పిల్లలకు సంబంధించిన రుగ్మతలకు లయన్ దొడ్ల గోపాలకృష్ణారెడ్డి, ఇంజనీర్ సీతారామస్వామి, విరుగు సుబ్రహ్మణ్యం ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ట్రస్ట్ బాధ్యులు కేతా సుబ్బారావు పర్యవేక్షించారు.

ధార్మిక పరీక్షల్లో

## టాలెంట్ చూపిన 'నేతాజీ'




టీటీడీ ఆధ్వర్యంలో హిందూధర్మ ప్రచార పరిషత్ నిర్వహించిన 'ధార్మిక విజ్ఞాన పరీక్షల్లో' నెల్లూరులోని శ్రీ నేతాజీ (ఎంఎస్ఆర్) పైలట్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. 6, 7తరగతుల విభాగంలో సి. హెచ్.శ్రీలేఖ ప్రథమశ్రేణి బహుమతిని వెండి మెడల్, వెయ్యి రూపాయల నగదు అందుకుంది. 8,9,10 తరగతుల విభాగంలో సిహెచ్.శ్రీనివాస్ ద్వితీయశ్రేణి బహుమతి వెండి మెడల్, యోగ్యతాపత్రం అందుకున్నారు. 6, 7 తరగతుల విభాగంలో శివాని ప్రోత్సాహక బహుమతిని అందుకున్నారు.

PDF Compressor Free Version



## మేషం



అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

పనులు అనుకున్న విధంగా జరగక ఆటంకములు కలగడం వలన టెన్షన్ ఉంటుంది. స్థిరాస్తుల వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలు సామరస్య పూర్వకంగా పరిష్కరించుతారు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉంది ఆదాయం పెరుగుతుంది. పరిచయాలు వ్యాపకాలు పెంచుకుంటారు. ఉద్యోగులకు అధికారుల వత్తిడి పనిభారం ఎక్కువగా ఉంటుంది.

## వృషభం



కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్శ1, 2పాదాలు

కుటుంబసౌఖ్యము, ప్రభుత్వ కార్యాలయాలలో పనులందు అనుకూలత, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. వృత్తి నిర్వహణలో విశ్రాంతి ఉండదు. వ్యాపారపరంగా పెట్టుబడులకు అఫర్లు లభించగలవు. ఈ రాశి వారికి ఆదాయం పెరిగినా ఏదో విధంగా అదనపు ఖర్చులుంటాయి. దూరప్రయాణాలు చేయడం, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది.


## మిధునం



మృగశిర్శ 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

నిలబడిపోయిన పనులు, ఏర్పడిన ఇబ్బందులు సర్దుకుంటాయి. వ్యాపార వర్గాలకు పెట్టుబడి అవకాశాలు అందగలవు. ఆదాయంకు తగిన ఖర్చులుంటాయి. విద్యా వివాహ విషయాలలో బిడ్డలయందు శ్రద్ధ చూపుతారు. దూరప్రయాణాలు నిర్ణయం కాగలవు. స్వయంకృషి తెలివి తేటలతో అనుకున్నది సాధిస్తారు. కాంట్రాక్టర్లకు, బిల్డర్లకు పరిశ్రమల యాజమాన్యాలకు అనుకూలం.


## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వ్యాపారవృద్ధికి వృత్తిపరంగా అభివృద్ధికి క్రొత్త ప్రణాళికలు ఆచరణలో పెడతారు. ఈ వారం ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి. స్థిరాస్తులు, పెట్టుబడులపై నిర్ణయాలు తీసుకొంటారు. బంధువర్గంలో అనారోగ్య వార్తలు వింటారు. ప్రభుత్వపరంగా అనుమతులు కాంట్రాక్టుల అనుమతులు, బ్యాంకు ఋణాలు ఆలస్యం కాగలవు. వ్యవహారాలలో ఆలసత్వం వహించవద్దు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము


వృత్తి ఉద్యోగాలలో మంచి అభివృద్ధి, అవకాశాలు గుర్తింపు గౌరవాలు లభిస్తాయి. సభలు సమావేశాలలో మీమాటకు విలువ ఉంటుంది. అనుకున్న పనులను శ్రమపడి నెరవేర్చుకొంటారు. ఆదాయం బాగుంటుంది. వ్యాపా రవర్గాలకు పెట్టుబడి అవకాశాలు లభించగలవు. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా సాగిస్తారు. కోర్టు వ్యవహారాలు, ఋణాల వ్యవహారాలలో అనుకూలత ఉన్నది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

పరిస్థితులనుబట్టి అందరితో సర్దుకొనిపోవాలి. ఏ విషయాన్ని తెగేదాకా లాగవద్దు. అనుకున్న పనులు హడావిడిగా పూర్తిచేస్తారు. వృత్తి, ఉపాధి పథకాలలో రాణిస్తారు. కాంట్రాక్టర్లకు బిల్డర్లకు కొత్త అవకాశాలు దొరుకుతాయి. ఉద్యోగులకు బాధ్యతలు పెరగడం, అధికారులకు స్థానచలనముంటుంది. షేర్లు, విక్రయాలు, లాభిస్తాయి. వ్యాపారవృద్ధికి అవకాశాలు దొరుకుతాయి.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 28.06.2013 నుండి
తేది. 4.07.2013 వరకు

ఈ వారం కుంభ మీనమేషవృషభ రాశులలో చంద్రుడు, మేషంలో కేతువు, వృషభంలో కుజుడు, మిథునంలో రవిగురుబుధులు, కర్కాటకంలో శుక్రుడు, తులలో శనిరాహువులు సంచరిస్తారు.


## పంచాంగము :

4తేది నుండి గురుమౌఢ్యమి సమాప్తి

### జ్యేష్ఠమాస కృష్ణపక్షతిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 28 | శుక్ర | పంచమి | ఉ॥గం.6.19ని॥ |
| | పిదప | షష్ఠి | రా॥గం.4.45ని॥ |
| తేది. 29 | శని | సప్తమి | రా॥గం.3.40ని॥ |
| తేది. 30 | ఆది | అష్టమి | రా॥ గం.3.05ని॥ |
| తేది. 01 | సోమ | నవమి | రా॥ గం.2.55ని॥ |
| తేది. 02 | మంగళ | దశమి | రా॥ గం. 3.22ని॥ |
| తేది. 03 | బుధ | ఏకాదశి | రా॥గం.4.12ని॥ |
| తేది. 04 | గురు | ద్వాదశి | రా॥గం. 5.29ని॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఆర్థిక వనరులు బాగున్నా ఖర్చులను అదుపులో ఉంచడం కష్టమౌతుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుండి కొత్త పెట్టుబడులు పెడతారు. హామీలు ఇతరులకు ఇవ్వడం, పెద్ద మొత్తాలలో అప్పులివ్వడం చేయవచ్చుట తగదు. అనుకున్న పనులు టెన్షన్‌తో జరుగుతుంటాయి. బిడ్డల విద్యా, వివాహ విషయాలపై శ్రద్ధ చూపుతారు. షేర్లు లాభాలనిస్తాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

తొందరపాటు నిర్ణయాలు చేయవద్దు. కోపం, పట్టుదల తగ్గించుకొంటే మంచిది. కాంట్రాక్టులు, ఉమ్మడి వెంచర్లు జరిపేవారు, బిల్డర్స్‌కు అనుకూల సమయము. మంచి ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును. ఆదాయము సామాన్యంగా ఉంటుంది. అనవసర విషయాలలో డబ్బు పెట్టి నష్టపడవలసి వస్తుంది. అవసరాలు, చెల్లింపులు వాయిదా వేసుకొంటారు. షేర్లు లాభిస్తాయి.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

నూతన పెట్టుబడులు ఉమ్మడి వ్యాపారాలకు అనుకూలము. వ్యాపారపారిశ్రామిక రంగాల వారికి ఆదాయం పెరుగుతుంది. చిన్న వ్యాపారులు కుటీర పరిశ్రమల వారికి ప్రోత్సాహకరంగా ఉంటుంది. అనుకున్న పనులు కొద్దిటెన్షన్‌తో సాగుతాయి. గృహ, వాహన వస్తు రిపేర్లుంటాయి. ఆర్థిక విషయాలలో సొంత నిర్ణయాలు శ్రేయస్కరం. బిడ్డల విద్యా వివాహ విషయాలపై శ్రద్ధ చూపుతారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

నిర్ణయాలు మంచివి తీసుకొన్నా ఫలితమివ్వడానికి టైమ్‌పడుతుంది. వ్యాపార లావాదేవీలందు జాగ్రత్త అవసరము. వ్యాపార అవకాశాలు చేజారవచ్చును. ముందుగా పెట్టిన పెట్టుబడుల మీద షేర్ల మీద లాభాలుంటాయి. అనుకున్న పనులను త్వరత్వరగా పూర్తిచేస్తారు. విద్యా పరమైన ఖర్చులు, వైద్య పరమైన ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. రాజకీయ వర్గాలకు ఒడుదుడుకులుంటాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

వృత్తి, వ్యాపారాలలో అభివృద్ధికి కష్టపడతారు ఆదాయం పెరుగుతుంది. స్థిరాస్తులు, గృహోపకరణాలు యంత్రాలు, ఆభరణాల వంటివి సమకూర్చుకొనే ప్రయత్నాలుంటాయి. కోర్టు వ్యవహారాలు, ఆస్తి వివాదాలు పరిష్కారం కావచ్చును. ఉద్యోగప్రయత్నాలలో జాగ్రత్తగా ఇంటర్వ్యూలు చేయండి. షేర్లు ఒడుదుడుకుల మధ్య సాగుతాయి. ఇంటి రిపేర్లు, వస్తు వాహన రిపేర్లుంటాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కార్య నిర్వహణసామర్థ్యం వలన సొసైటీలో గుర్తింపు గౌరవాలు పొందుతారు. స్థిరాస్తుల నుండి ఆదాయము అందుతుంది. వృత్తి వ్యాపార పరిశ్రమల రంగాల వారికి ఆర్థికస్థితి అనుకూలించి ఆదాయం పెరుగుతుంది. వస్తు ధనరూపంలో హామీలు సహాయం మేలుకాదు. అనుకున్న పనులు సకాలంలో పూర్తిచేస్తారు. బిడ్డల విద్యా వివాహ ఉద్యోగవిషయాలపై శ్రద్ధ చూపుతారు.

# జోరుగా పంచాయితీ పోరు

స్థానికఎన్నికల సంగ్రామంలో ఒక అంకం పూర్తయ్యింది. ఏ పంచాయతీ ఏ వర్గానికి రిజర్వుడ్ అయ్యిందని వెల్లడి కావడంతో గ్రామ సీమలలో అసలైన పోరుకు తెర లేసింది. మహిళలకు 50శాతం రిజర్వేషన్ అమలు చేయడంతో ఈసారి మహిళా అభ్యర్థుల కోసం తీవ్ర అన్వేషణ కొనసాగుతుంది. మరో ఏడాదిలోవున్న అసెంబ్లీ ఎలక్షన్స్‌కు ఇవి రిహార్సల్స్‌గా మారడంతో పంచాయితీ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అన్ని పార్టీలు కూడా అభ్యర్థుల ఎంపికపై దృష్టి పెట్టాయి. పంచాయితీ ఎన్నికలు రావడంతో మద్యం వ్యాపారులు కూడా తెగ సంబరపడిపోతున్నారు.

### మండలాల వారీగా పంచాయితీ రిజర్వేషన్లు...

| మండలం | మొత్తం పంచాయితీలు | ఎస్టీ జ | ఎస్టీ మ | ఎస్సీ జ | ఎస్సీ మ | బీసీ జ | బీసీ మ | అన్‌రిజర్వుడ్ జ | అన్‌రిజర్వుడ్ మ |
|---|---|---|---|---|---|---|---|---|---|
| ఆత్మకూరు | 21 | 1 | 0 | 2 | 1 | 2 | 2 | 6 | 7 |
| ఏఎస్‌పేట | 19 | 0 | 0 | 1 | 1 | 3 | 3 | 6 | 5 |
| అనంతసాగరం | 24 | 1 | 0 | 2 | 2 | 3 | 3 | 7 | 6 |
| చేజర్ల | 22 | 1 | 0 | 2 | 1 | 2 | 2 | 7 | 7 |
| ఇందుకూరుపేట | 20 | 1 | 2 | 2 | 2 | 3 | 4 | 3 | 3 |
| కలువాయి | 20 | 1 | 0 | 2 | 2 | 2 | 2 | 6 | 5 |
| ముత్తుకూరు | 20 | 1 | 1 | 3 | 2 | 4 | 4 | 3 | 2 |
| నెల్లూరు | 17 | 1 | 1 | 2 | 1 | 3 | 2 | 4 | 3 |
| పొదలకూరు | 30 | 1 | 2 | 2 | 3 | 4 | 4 | 7 | 7 |
| రాపూరు | 21 | 1 | 2 | 2 | 3 | 3 | 3 | 3 | 4 |
| టీపీగూడూరు | 22 | 1 | 1 | 2 | 3 | 4 | 4 | 3 | 4 |
| వెంకటాచలం | 25 | 1 | 2 | 3 | 3 | 4 | 4 | 4 | 4 |
| అల్లూరు | 13 | 2 | 2 | 2 | 2 | 2 | 2 | 0 | 1 |
| బోగోలు | 16 | 1 | 1 | 2 | 2 | 2 | 2 | 3 | 3 |
| బుచ్చి | 15 | 1 | 2 | 3 | 3 | 2 | 2 | 1 | 1 |
| దగదర్తి | 20 | 0 | 1 | 2 | 2 | 3 | 3 | 4 | 5 |
| దుత్తలూరు | 17 | 0 | 0 | 1 | 1 | 2 | 2 | 6 | 5 |
| జలదంకి | 17 | 1 | 1 | 3 | 2 | 2 | 2 | 3 | 3 |
| కలిగిరి | 23 | 1 | 0 | 2 | 1 | 2 | 2 | 8 | 7 |
| కావలి | 18 | 0 | 1 | 2 | 2 | 4 | 4 | 2 | 3 |
| కొడవలూరు | 21 | 1 | 2 | 2 | 3 | 3 | 3 | 3 | 4 |
| కొండాపురం | 19 | 1 | 0 | 2 | 2 | 2 | 3 | 5 | 5 |
| కోవూరు | 10 | 2 | 3 | 2 | 3 | 0 | 0 | 0 | 0 |
| మర్రిపాడు | 24 | 1 | 0 | 2 | 2 | 4 | 3 | 6 | 6 |
| సంగం | 20 | 1 | 1 | 2 | 2 | 3 | 4 | 3 | 4 |
| సీతారామపురం | 14 | 0 | 0 | 1 | 1 | 3 | 3 | 3 | 3 |
| ఉదయగిరి | 17 | 0 | 0 | 1 | 1 | 2 | 3 | 5 | 5 |
| వరికుంటపాడు | 24 | 1 | 0 | 2 | 1 | 4 | 3 | 7 | 6 |
| విడవలూరు | 14 | 1 | 2 | 2 | 2 | 3 | 3 | 1 | 0 |
| వింజమూరు | 12 | 1 | 0 | 1 | 1 | 2 | 1 | 3 | 3 |
| బాలాయపల్లి | 24 | 1 | 1 | 2 | 2 | 2 | 3 | 6 | 7 |
| చిల్లకూరు | 31 | 2 | 1 | 3 | 3 | 4 | 3 | 8 | 7 |
| చిట్టమూరు | 23 | 1 | 1 | 3 | 3 | 3 | 3 | 5 | 4 |
| డి.వి.సత్రం | 22 | 1 | 1 | 3 | 2 | 3 | 3 | 4 | 5 |
| దక్కిలి | 27 | 1 | 1 | 2 | 2 | 3 | 4 | 7 | 7 |
| గూడూరు | 23 | 1 | 2 | 3 | 3 | 3 | 3 | 4 | 4 |
| కోట | 21 | 2 | 1 | 3 | 3 | 3 | 2 | 4 | 3 |
| మనుబోలు | 19 | 1 | 1 | 2 | 3 | 2 | 2 | 4 | 4 |
| నాయుడుపేట | 18 | 1 | 1 | 2 | 3 | 2 | 2 | 3 | 4 |
| ఓజిలి | 26 | 1 | 1 | 2 | 2 | 4 | 3 | 7 | 6 |
| పెళ్లకూరు | 24 | 1 | 1 | 2 | 3 | 3 | 3 | 5 | 6 |
| సూళ్లూరుపేట | 19 | 0 | 1 | 2 | 3 | 2 | 2 | 4 | 5 |
| సైదాపురం | 31 | 2 | 1 | 3 | 2 | 3 | 4 | 8 | 8 |
| తడ | 18 | 0 | 1 | 2 | 3 | 3 | 3 | 3 | 3 |
| వాకాడు | 19 | 1 | 1 | 3 | 3 | 2 | 2 | 4 | 3 |
| వెంకటగిరి | 20 | 1 | 0 | 2 | 1 | 3 | 3 | 5 | 5 |
| మొత్తం | 940 | 43 | 43 | 98 | 98 | 127 | 126 | 203 | 202 |

### వార్డుల రిజర్వేషన్లు

| ఎస్టీ జ | ఎస్టీ మ | ఎస్సీ జ | ఎస్సీ మ | బీసీ జ | బీసీ మ | ఇతరులు జ | ఇతరులు మ |
|---|---|---|---|---|---|---|---|
| 269 | 698 | 1167 | 1341 | 1213 | 1112 | 1806 | 1304 |

నోట్: జ - జనరల్ మ - మహిళలు




# పెళ్లి సంబంధాలు

## వధువు కావలెను

1. 1984 ఆగష్టు19 జననం. ఎత్తు 5'9". చదువు బి.ఇ(మెకానికల్), యం.బి.ఎ(ఐటి) - ఆస్ట్రేలియా. ఉద్యోగం విప్రో, చెన్నై, జీతం నెలకు 50వేలు. ఆస్థివాటా 7కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం మద్రాసు.
2. 1986 జూన్ 15 జననం. ఎత్తు 5'11". చదువు బి.ఇ(హైదరాబాద్), యం.బి.ఏ(ఫైనాన్స్), ముంబాయి. ఉద్యోగం సీనియర్ అసోసియేట్ కన్సల్టెంట్ - ఇన్ఫోసిస్ లిమిటెడ్, హైదరాబాద్. జీతం నెలకు రూ.75,000/-. ఆస్థి విలువ 9కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
3. 1983 మార్చి 19 జననం. ఎత్తు 5'6". చదువు యం.బి.బి.యస్. పి.జి. డిప్లొమా ఆర్థోపెడిక్స్ అనంతపూర్. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్తి విలువ 4కోట్లు. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుత నివాసం బెంగుళూరు.
4. 1986 సెప్టెంబరు 10 జననం. ఎత్తు 5'8". చదువు యం.బి.బి.యస్., యం.డి (పీడియాట్రిక్స్) 2వ సం॥ కరీంనగర్. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం కర్నూలు జిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
5. 1989 ఏప్రిల్ 4 జననం. ఎత్తు 6'2". చదువు బి.ఇ(సిబిఐటి), హైదరాబాద్. యం.యస్.(కన్‌స్ట్రక్షన్స్ & మేనేజ్‌మెంట్), కాలిఫోర్నియా, అమెరికా. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్తి వాటా రూ.75కోట్లు. స్వస్థలం నల్గొండజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.

## వరుడు కావలెను

6. 1986 నవంబరు 13 జననం. ఎత్తు 5'6 1/2". చదువు బి.ఇ కంప్యూటర్స్, ఉద్యోగం టి.సి.యస్., చెన్నై, జీతం నెలకు రూ.50,000/-. ఆస్తి వాటా 1కోటి. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం చెన్నై.
7. 1986 మే 30 జననం. ఎత్తు 5'4 1/2". చదువు బిపిటి ఫిజియోతెరపీ, మాస్టర్స్ ఇన్ ఫిజియోథెరపీ, హైదరాబాద్. ఉద్యోగం నిమ్స్ హాస్పిటల్. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్థివాటా 1 కోటి. స్వస్థలం కర్నూలుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
8. 1990 ఏప్రిల్ 3 జననం. ఎత్తు 5'4". చదువు బి.టెక్(ఇఇఇ), బెంగుళూరు. యం.యస్(ఇఇఇ) వర్జీనియా(అమెరికా). ఆస్థివాటా 4కోట్లు. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం కడపజిల్లా. ప్రస్తుత నివాసం విజయవాడ.
9. 1987 సెప్టెంబరు 25 జననం. ఎత్తు 5'4". చదువు బి.బి.యమ్(మార్కెటింగ్), సింగపూర్. ఉద్యోగం జనరల్ మేనేజర్ (మార్కెటింగ్), టెక్స్‌టైల్ కంపెని. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్థివిలువ 10కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం మద్రాసు.
10. 1989 డిసెంబరు 1 జననం. ఎత్తు 5'5". చదువు బి.టెక్(కంప్యూటర్స్), యం.బి.ఏ(యుకె). ఉన్నతమైనరెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్థివిలువ 50కోట్లు. స్వస్థలం కడపజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.



వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
ఫోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ఫ్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

# మద్యంతో ప్రజాధనం లూటీ



నెల్లూరు మినీబైపాస్‌లోని తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో ఈ నెల 26న విలేకరుల సమావేశం జరిగింది. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలచేత వీలైనంత మద్యం తాగించి ప్రజాధనాన్ని లూటీ చేయాలనే ఆలోచన తప్ప నూతన మద్యం పాలసీలో మరొకటి కనిపించడం లేదన్నారు. మద్యం వ్యాపారాన్ని విశృంఖలంగామార్చి 2004లో రూ.4వేల కోట్లు వున్న ఆదాయాన్ని నేడు రూ.24వేల కోట్లకు పెంచుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రజల ఆరోగ్యంపై, సంక్షేమంపై ఎలాంటి ఆలోచన లేదని, మద్యం బెల్టుషాపులను తొలగిస్తానన్న ముఖ్యమంత్రి మద్యం విక్రయించే షాపులనే బార్లుగా మార్చడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మద్యం బెల్టుషాపులకు వ్యతిరేకంగా మహిళలు చేసే పోరాటాలకు తెలుగుదేశంపార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన మద్యం పాలసీని వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేసారు. బెల్టుషాపులను పూర్తిగా తొలగిస్తానన్న ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి మాటతప్పి నూతన మద్యంపాలసీని ప్రకటించి రాష్ట్ర మహిళలను మోసం చేశారని పేర్కొన్నారు. మద్యవిక్రయమే పెద్ద ఆదాయవనరుగా భావించి, ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడడం ఈ ప్రభుత్వానికి తగదన్నారు. సమావేశంలో టిడిపి మహిళా నేతలు తాళ్ళపాక అనూరాధ, అంచలవాణి, నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూరల్ ఇన్‌ఛార్జ్ కిలారి వెంకటస్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# శోభాయమానంగా శ్రీనివాస కళ్యాణోత్సవం



గోవింద నామం ఎన్నిసార్లు విన్నా ఇంకా వినాలనిపిస్తూనే వుంటుంది. ఆ నామంలో అంత రుచి వుంటుంది. టీటీడి ధార్మిక సలహామండలి, ధర్మప్రచార పరిషత్ వాళ్లు క్రమం తప్పకుండా వారానికొకసారయినా నెల్లూరులోని శ్రీవారి భక్తులకు శ్రీనివాస నామాలను స్మరించుకునే అవకాశం కల్పిస్తూనే వున్నారు.

ఈ పరంపరలోనే 26వ తేదీ రాత్రి నెల్లూరు మినీబైపాస్‌లోని పరమేశ్వరీ మహేశ్వరీ కల్యాణ మండపంలో మయూరి హోటల్ అధినేత వీరిశెట్టి సుబ్బారావు ఆధ్వర్యంలో శ్రీనివాస కల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రవణానక్షత్రాన్ని పురస్కరించుకొని ఈ వేడుకను నిర్వహించారు. కల్యాణ మండపంలో కల్యాణ వేదికను అత్యంత శోభాయమానంగా అలంకరించారు. తొలుత శ్రీవారికి తిరుమంజనం సేవలు జరిగాయి. అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడిని కల్యాణ వేదికపై ప్రతిష్ఠించి తనూజ విష్ణుశర్మ, ఫణిశర్మ బృందం పండితులు వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఉదయం టీటీడీ కల్యాణ మండపంలోనూ, బాలాజీనగర్‌లోని సీతారామ స్వామి మందిరంలోనూ శ్రీవారి కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. కల్యాణోత్సవాలలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని తిలకించి భక్తి తన్మయత్వంతో తరించారు.

# కన్యకాపరమేశ్వరి చిత్రపటం ఆవిష్కరణ



కన్యకాపరమేశ్వరి అమ్మవారి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న ముక్కాల ద్వారకానాథ్, తదితరులు

నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలోని పప్పులవీధిలోగల పాండురంగ అన్నదాన సమాజంలో ఈనెల 25న అర్బన్ ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు ముక్కాల ద్వారకానాథ్ శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మ వారి చిత్రపటాన్ని ఆవిష్క రించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి పటం కావలసినవారు 99491 91977కు ఫోనుచేసి పేరు, చిరునామా తెలిపితే వారి నివాసానికే పంపుతామన్నారు. పేద ఆర్యవైశ్యులు ఈనెల 28వతేదీలోపు నవాబుపేటలోని తమ కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటే కుట్టుమిషన్లు, తోపుడుబండ్లు, గ్రైండర్లు పంపిణీ చేస్తామన్నారు. తమిళనాడు గవర్నర్ కొణిజేటి రోశయ్య జన్మదినమైన జూలై 4న వేడుకలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్‌ఆర్యవైశ్య సంఘం ప్రధాన కార్యదర్శి సరాబు సుబ్రహ్మణ్యం, కోశాధికారి పబ్బిశెట్టి శ్రీనివాసులు, కన్యకాపరమేశ్వరి దేవస్థాన కమిటీ అధ్యక్షుడు పడిదం పార్థసారథి, అయితా భాస్కర్, శ్రీరామ్ రమేష్, తిరువీధి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన అబ్కారీ విధానంతో రాష్ట్రంలో ....

# ఉత్తరాఖండ్ వరదలా మద్యం



మందుబాబులకు మహా హుషారు కలిగించే నూతన మద్యం పాలసీని మన రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తెస్తోంది. కొత్త అబ్కారీ సంవత్సరానికి సంబంధించి విడుదలచేసిన మార్గదర్శకాలతో పల్లెలు, పట్టణాలలో మద్యం ఉత్తరాఖండ్ వరదలాగా పారనుంది. ఈ మధ్యనే కేంద్రమంత్రి, జైరాం రమేష్ బహిరంగ సభలో బెల్టుషాపులు ఎత్తేయమని ఉద్యమించండని మహిళలకు చెబుతున్నా పక్కనున్న మన ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి కిమ్మనకుండా వుండింది ఇందుకన్న సంగతి ఇప్పుడర్థమవుతోంది. ముఖ్యమంత్రి గారి నూతన అబ్కారీ విధానంతో మద్యం దుకాణాలన్నీ మినీబార్లుగా మారిపోతాయి. ప్రభుత్వం ప్రజలకు మంచిని పంచే విధంగా కాకుండా చెడును ప్రోత్సహించే రీతిలో సాగడం విడ్డూరంగా వుంది. బెల్టుషాపులు ఎత్తేస్తామన్న మన ముఖ్యమంత్రి నేరుగా మద్యం దుకాణాలనే బార్లుగా తీర్చిదిద్దేలా ఉత్తర్వులివ్వడం ఆదాయం కోసం ఎంతకైనా బరితెగించేలాగుంది. ఈ మార్గదర్శకాలతో జిల్లాలోని అధికశాతం మద్యం దుకాణాలన్నీ బార్లుగా మారనున్నాయి. 5వేలకు పైన జనాభా కలిగిన ప్రాంతాల్లోని ప్రతి మద్యం దుకాణం పక్కనే పర్మిట్ రూమ్ ఏర్పాటుచేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఇంతకుముందు 15చదరపు మీటర్ల విస్తీర్ణంలో పర్మిట్‌రూమ్ ఏర్పాటుకు అనుమతి వుండగా, ఇపుడు 50చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసుకోవచ్చు. ఇప్పటిదాకా పర్మిట్‌రూమ్ ఏర్పాటుకు లైసెన్సుఫీజు లక్షరూపాయలు చెల్లించాల్సి వుండగా, ఇప్పుడు 2లక్షలకు పెంచారు. పర్మిట్లరూపంలో ప్రభుత్వ ఖజానాకు దాదాపు 4.60కోట్ల ఆదాయంరానుంది. ఇప్పటికే పేదకుటుంబాల్లో మగవారు కూలినాలి చేసి సంపాదించిన సొమ్మును మందుసేవనకే వెచ్చిస్తూ కుటుంబాలను పట్టించుకోకుంటే, ఈ పర్మిట్ రూమ్‌ల ఏర్పాటుతో మితిమీరిన ఉత్సాహంతో పెట్రేగిపోతారని మహిళలు ఆవేదన చెందుతున్నారు. మొత్తంమీద ఏమైతేనేం, ఎవరెటుపోతే నాకేం అన్న చందంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి చేష్టలు కనిపిస్తున్నాయనిపిస్తోంది.

# గిరిజన ప్రతిభామూర్తులకు పురస్కారం



అవగాహన సదస్సులో విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరులోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్బా కళాక్షేత్రంలో ఈనెల 23న ఏఆర్‌డి స్వచ్ఛంద సేవాసంస్థ, యానాది సమాఖ్యల సంయుక్త నిర్వహణలో పదో తరగతి ఉత్తీర్ణులైన గిరిజన విద్యార్థులకు, తల్లి దండ్రులకు అవగాహనసదస్సు జరిగింది. ముఖ్యఅతిథులుగా జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జిల్లా ఎస్పీ బి.వి. రమణకుమార్‌లు పాల్గొని పదో తరగతి పరీక్షలలో ప్రతిభ కనబరిచిన గిరిజన విద్యార్థులు 408మందిని అభినందించారు. యాక్షన్ ఎయిడ్ ఆర్థిక సహాయంతో ఏఆర్‌డి గూడూరు సౌజన్యంతో ఉన్నత విద్యను అభ్యసించే గిరిజన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఆర్థిక చేయూతనిచ్చారు. కార్యక్రమంలో ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి యాకసిరి వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ అధికారి వెంకటసుబ్బయ్య, జిల్లా విద్యాశాఖాధికారి మువ్వా రామలింగం, ఆర్‌విఎమ్ ప్రాజెక్టు అధికారి డి.కోదండరామిరెడ్డి, జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు మల్లికశైలజ, ఏఆర్‌డి డైరెక్టర్ షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎంసిఐ ముందుకు నెల్లూరు వైద్యకళాశాల నివేదిక

నెల్లూరు నగరం దర్గామిట్టలోని దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యశాల ఆవరణంలో నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్యకళాశాల స్థితిగతులు, ఆస్పత్రిలో వైద్య మౌలిక సదుపాయాలు తదితర విషయాలతో కూడిన నివేదికను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) ముందు ఉంచనున్నారు. ఈ ఏడాదికి మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ విద్యకు సీట్లు కేటాయించడంలో ఎంసీఐ తర్జనభర్జన పడుతోంది. ఈ క్రమంలో నెల్లూరులో ఏర్పాటు చేయనున్న వైద్యకళాశాలకు ఇప్పటి వరకు ఎలాంటి వసతులున్నాయి, ప్రస్తుత సిబ్బంది సరిపోతారా, కొత్తగా నిర్మాణంలో ఉన్న భవన పురోగతి, ప్రస్తుతమున్న సిబ్బంది వివరాలు ఆసుపత్రిలో ఉన్న మౌలిక సదుపాయాలు, అధ్యాపకులు తదితర విషయాలతో కూడిన నివేదికను అందజేయాలని డెవలప్‌మెంట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్(డిఎంఈ)ను ఎంసీఐ ఇటీవల ఆదేశించింది. ఈనేపథ్యంలో ఇప్పటికే డిఎస్ఆర్ ఆసుపత్రికి వైద్యకళాశాల సిబ్బందిగా 28మంది ప్రొఫెసర్లు, అసిస్టెంట్ కమ్ అసోసియేట్ ప్రొఫెసర్లు, డిఎస్ఆర్ ఆసుపత్రి ఉన్నతాధికారులు చర్చించుకుని పలు వివరాలపై డిఎంఈకి నివేదించారు. ఈ నివేదికను నెల్లూరు నుంచి వెళుతున్న కొంత మంది ప్రొఫెసర్లు హైదరాబాదులోని డిఎంఈ నుంచి వెళుతున్న మరికొందరు ఉన్నతాధికారులు వైద్య కళాశాల పురోగతిపై ఢిల్లీలోని ఎంసీఐ ముందు ప్రత్యక్షంగా వివరణ ఇవ్వనున్నారు. జిల్లాలో ఏర్పాటు చేయనున్న వైద్యకళాశాలలో మౌలిక సదుపాయాలను పర్యవేక్షించేందుకు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం త్వరలో జిల్లాకు రానున్నట్లు సమాచారం.




PDF Compressor Free Version




# మూ'వీ'క్షణం

## ప్ర'కాష్' వద్దన్నాడు




అథ్లెట్ మిల్కాసింగ్ జీవితకథ ఆధారంగా రూపొందుతున్న 'భాగ్ మిల్కా భాగ్' చిత్రంలో ప్రకాష్‌రాజ్ మిల్కాసి. పాత్రధారి ఫర్హాన్ అక్తర్‌కు కోచ్‌గా నటిస్తున్నారు. అయితే ఈ సినిమాలో హీరోయిన్ సోనమ్‌కపూర్ 11రూపాయలు పారితోషికంగా తీసుకోగా... ప్రకాష్ మాత్రం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా నటిస్తుండడం విశేషం.

## 'రచ్చ' చరణ్‌దే...



ఇటీవల హైదరాబాద్‌లో తన కారుకు సైడ్ ఇవ్వలేదనే కోపంతో చరణ్‌తేజ్ తన సెక్యూరిటీ చేత ఇద్దరు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను కొట్టించిన గొడవ చిలికిచిలికి గాలివానగా మారుతుంది. బంజారాహిల్స్ పోలీసులు మానవహక్కుల కమీషన్‌కు సమర్పించిన నివేదికలో ఈ విషయంలో చరణ్‌దే తప్పని పేర్కొన్నారు. మరి ఈ కేసు ఏ మలుపు తిరుగుతుందో?

## అందరూ... వాడేసుకుంటున్నారు



ఈమధ్య తెలుగు సినిమాల్లో అందరూ పవన్‌కళ్యాణ్ పేరును, ఆయన ఇమేజ్‌ను 'దూకుడు' సినిమాలో బ్రహ్మానందాన్ని మహేష్ బాబు వాడుకున్నట్లు వాడేసుకుంటున్నారు. రామ్‌చరణ్ వాడుకున్నాడంటే... కొడుకు వరుస కాబట్టి ఏమీ అనలేరు. మొన్న 'గుండెజారి గల్లంతయ్యిందే'లో పవన్‌ను నితిన్ ఏ విధంగా వాడుకున్నాడో చూసాం. పూరి జగన్నాథ్ 'ప్రతి వెధవ పవన్ కళ్యాణ్ ఫ్యానే' అంటూ నోరుజారి క్షమాపణ చెప్పుకున్నాడు. తాజాగా అనిల్ సుంకర కూడా 'యాక్షన్ 3డి' చిత్రంలో 'గబ్బర్‌సింగ్'లోని పాటను వాడేసుకున్నాడు.

## మాస్‌స్టెప్పులేస్తున్న శృతి



మెగాపవర్‌స్టార్ రామ్ చరణ్ - శృతిహాసన్‌లపై 'ఎవడు' సినిమా కోసం హైదరాబాద్‌లో మాస్ పాట షూటింగ్ జరుగుతుంది. దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశలో వుండగా జూలై ఆఖరులో రిలీజ్‌కు సన్నాహాలు చేస్తున్నారు.

## విజయదశమికి 'రేసుగుర్రం'



పూరి జగన్నాథ్ 'ఇద్దరమ్మాయిలతో' బెడిసికొట్టడంతో అల్లు అర్జున్ డైలమాలో పడ్డాడు. నెక్ట్స్ ఖచ్చితంగా హిట్ కొట్టాలనే పట్టుదలతో వున్నాడు. ప్రస్తుతం సురేంద్రరెడ్డి దర్శకత్వంలో 'రేసుగుర్రం' చిత్రంలో నటిస్తున్నాడు. రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా షూటింగ్ మే13న మొదలైంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుంది. జూలై 1 నుండి యూరప్‌లో తాజా షెడ్యూల్‌ను ప్లాన్ చేశారు. శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాను విజయదశమికి విడుదల చేయనున్నారు.



# గూడూరు డివిజన్ వార్తలు

## బస్సులు కండిషన్‌లో వుంచాలి

### డీఎస్పీ చౌడేశ్వరి



ధృవపత్రాలను పరిశీలిస్తున్న డీఎస్పీ చౌడేశ్వరి

గూడూరు పట్టణంలోని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు అతిక్రమించి బస్సులను నడిపితే కఠినచర్యలు తప్పవని గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి హెచ్చరించారు. గూడూరు అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో ఈ నెల 23వ తేదీ పట్టణంలోని ప్రైవేటు పాఠశాల బస్సుల కండీషన్‌ను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాల యాజమానులు బస్సు డ్రైవర్లకు 60ఏళ్లు పూర్తయితే వెంటనే పనిలోనుంచి తొలగించాలన్నారు. ఇటీవల ఖమ్మంలో బస్సు డ్రైవర్‌కాకుండా క్లీనర్ నడపడంతో ప్రమాదం సంభవించిందని, దీన్ని దృష్టిలో ఉంచుకొని కండీషన్‌ను పరిశీలిస్తున్నామన్నారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్ తప్పనిసరిగా ఉంచుకోవాలని, మంటలను అదుపుచేసేందుకు ఉపయోగించే సిలిండర్లను ఏర్పాటుచేయాలన్నారు. బస్సుల్లో డ్రైవర్, క్లీనర్‌తో పాటు కేర్‌టేకర్ కూడా ఉండాలన్నారు. ఇకపై ప్రతినెలా తనిఖీ చేస్తుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణసిఐ ఉప్పాల సత్యనారాయణ, ఎస్ఐ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి

### రామనారాయణరెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అవుతుందని రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి రామనారాయణరెడ్డి అన్నారు. చిల్లకూరు మండలంలోని వరగలి క్రాస్‌రోడ్డు వద్ద మండలంలోని పలు రోడ్డు పనులకు, పలు అభివృద్ధి కార్యక్రమాలకు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి రఘువీరారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలో సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి గత నాలుగేళ్లుగా పనబాక కృష్ణయ్య ఎన్నో అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషిచేస్తున్నారని ఆయన ఎమ్మెల్యేగా ఓడిపోయినా గూడూరు నియోజకవర్గ అభివృద్ధి కోసం తమ వెంటపడుతూ నిధులు మంజూరు చేయుంచుకుంటూనే వున్నారన్నారు. గూడూరు ప్రాంత అభివృద్ధికి కొన్ని వందలకోట్లు తీసుకువచ్చిన ఘనత పనబాక కృష్ణయ్యకు దక్కుతుందన్నారు ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, మాదాసు గంగాధరం గూడూరు ఎఎంసీ ఛైర్మన్ బాబురెడ్డి, గూడూరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు హరిప్రసాద్‌రెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పుచ్చకాయల జనార్ధన్ మాజీ ఎంపిటీసీ దువ్వూరు మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## తూర్పు కనుపూరు ముత్యాలమ్మకు పంచామృతాభిషేకం



చిల్లకూరు మండలంలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ఈ నెల 23వ తేదీ పంచామృతాభిషేకం నిర్వహించారు. అనంతరం పొంగళ్లు పొంగించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారిని దర్శించుకొనేందుకు భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు.

దూరప్రాంతాల నుంచి భక్తులు తమ కుటుంబసభ్యులతో, బంధుమిత్రులతో అమ్మ వారిని దర్శించుకునేందుకు తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ముందుగా అమ్మవారికి పంచామృతాభిషేకం చేసిన అర్చకులు అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ ఈఓ ఆవుల వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

## వైభవంగా వెంకటేశ్వరుని కల్యాణోత్సవం

గూడూరు పట్టణంలోని రాజావీధి సమీపంలో వున్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 24వ తేదీ స్వామివారికి వైభవంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకం, విష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించి, ప్రత్యేక పూజలు చేసి రాత్రి వేదపండితులు వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల మధ్య స్వామి వారికి అమ్మవార్లతో తిరుకల్యాణోత్సవం జరిపించారు.

అనంతరం స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించి సహస్ర దీపాలంకరణలో ఊంజల్‌సేవ నిర్వహించారు. గజ వాహనం పై ఉన్న స్వామి వారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

## మా సమస్యలు పరిష్కరించండి



గూడూరు ఆర్డీఓకు అర్జీలు అందజేస్తున్న ప్రజలు

గూడూరు ఆర్డీఓ కార్యాలయంలో ఈనెల 24వతేదీ జరిగిన గ్రీవెన్స్‌డేకు డివిజన్‌లోని పలు మండలాల ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలను అందజేశారు. అందులో ఎక్కువగా భూములు పంపిణీ చేయాలని విన్నవించుకొన్నారు. పెళ్లకూరు మండలం పెన్నేపల్లి లోని సర్వేనెంబరు 72,65-3లో ఉన్నటువంటి పట్టాభూమిని విక్కి ఇండస్ట్రీస్‌వారు ఆక్రమించి కట్టడాలను నిర్మిస్తున్నారని వారి వద్ద నుంచి భూమిని ఇప్పించాలని కోరుతూ చెంచురామయ్య ఆర్డీఓకు ఫిర్యాదు చేశారు. చిల్లకూరు మండలంలోని బల్లవోలుకు చెందిన శ్రీ రంగం రమణయ్య సర్వేనెంబరు 496లోని 50సెంట్లు ప్రభుత్వ భూమిని తరతరాలు సాగుచేసుకుంటున్నామని, అయితే గ్రామానికి చెందిన కొంత మంది తమపై దౌర్జన్యంచేసి, ఆక్రమించుకున్నారని ఫిర్యాదుచేశారు.

గూడూరు రూరల్ మండలం పోటుపాళానికి చెందిన జమళ్ల దయాకర్ 61, సెంట్ల ప్రభుత్వభూమిని 1921 నుంచి తమ కుటుంబానికి చెందినవారే సాగుచేసుకొని జీవనంచేస్తున్నామని అయితే ఆ భూములకు వేరొకరికి పాసుపుస్తకాలు మంజూరుచేశారని న్యాయం చేయాలంటూ ఆర్డీఓకు విన్నవించారు.

## పోలీస్‌స్టేషన్‌లో ఫ్యామిలీ కౌన్సిలింగ్



ఫ్యామిలీ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న డిఎస్పీ చౌడేశ్వరి

గూడూరు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 22వ తేదీ గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి ఫ్యామిలీకౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా ఎస్పీ రమణ కుమార్ ఆదేశాల మేరకు గూడూరులో నెలరోజులక్రితం నుంచి కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటుచేశామన్నారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దాదాపు కనుమరుగవుతోందని దీంతోనే భార్యభర్తలు చిన్నచిన్న వివాదాలతో విడిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయని అన్నారు. ఎస్పీ రమణకుమార్ చిన్న చిన్న వివాదాల కారణంగా భార్యాభర్తలు విడిపోకూడదని వారికి వివిధ కేటగిరిలకు చెందిన అనుభవజ్ఞులైన వారిచే కౌన్సిలింగ్ ఇచ్చేలా చర్యలు చేపట్టారన్నారు. కౌన్సిలింగ్ సెంటర్‌ద్వారా ఇప్పటి వరకు 20కేసులను విచారించడం జరిగిందన్నారు. విడిపోయిన భార్యాభర్తలను కౌన్సిలింగ్‌తో ఒకటి చేశామన్నారు. కౌన్సిలింగ్ సెంటర్‌కు వాకాడు, వెంకటగిరి, గూడూరు పట్టణం, రూరల్ పరిధి నుంచి ఎక్కువగా కేసులు వస్తున్నాయని అన్నారు. వాటిలో కూడా రెండు, మూడేళ్ల క్రితం విడిపోయిన భార్యాభర్తలు ఎక్కువగా ఉన్నారన్నారు. చిన్న చిన్న కారణాల వల్ల పట్టుదలకుపోయి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారన్నారు. దీంతో అభంశుభం తెలియని వారి బిడ్డలు మానసికంగా కృంగిపోతూ తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ఫ్యామిలీ కౌన్సిలింగ్‌లో సిఐ ఉప్పాల సత్యనారాయణ, ఎస్సై అంకమరావు, సారంగం సులక్ష్మి, మంజులమ్మ, అర్బన్ సిడిపివో ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version





ఈ నెల 23వ తేదీన విశాఖపట్నంలో జరిగిన ఒలింపిక్‌డే రన్-2013లో ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి పాల్గొన్న రాజ్యసభసభ్యులు డా॥ తిక్కవరపు సుబ్బరామిరెడ్డి, మంత్రి ఘంటా శ్రీనివాసరావు, మెగాపవర్‌స్టార్ రామ్‌చరణ్‌తేజ్, విజయవాడ ఎంపి లగడపాటి రాజగోపాల్



ఇటీవల ఉత్తరాఖండ్ వరదల నుండి తప్పించుకుని న్యూఢిల్లీలోని ఏపిభవన్‌కు చేరుకున్న వరదబాధితులను పరామర్శిస్తున్న రాజ్యసభసభ్యులు టి.సుబ్బరామిరెడ్డి

# దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త సతీష్‌రెడ్డి



సతీష్‌రెడ్డి దంపతులను సత్కరిస్తున్న యం.వెంకయ్యనాయుడు, పనబాక లక్ష్మీ

భారతదేశ క్షిపణి రంగానికి గుండెకాయ లాంటి డిఆర్‌డిఓ ఇమారత్ డైరెక్టర్‌గా నియమితులైన మన నెల్లూరీయుడు, ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన గుండ్రా సతీష్‌రెడ్డికి 27వ తేదీ సాయంత్రం నెల్లూరు టౌన్‌హాల్‌లో అభినందన సభ జరిగింది.



సభలో ప్రసంగిస్తున్న యం.వెంకయ్యనాయుడు

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటీ, విఆర్ కళాశాల పూర్వవిద్యార్థులు కలసి ఈ అభినందన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. నెల్లూరుజిల్లాలోని ఓ మారుమూల గ్రామంలో మధ్యతరగతి కుటుంబంలో పుట్టి దేశమే గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ఎదిగిన సతీష్‌రెడ్డి అభినందనసభకు ప్రజాప్రతినిధులందరు కూడా తమ రాజకీయ మనస్పర్థలను పక్కనపెట్టి ఒకే వేదిక మీదకు చేరడం ఆయనకిచ్చిన గౌరవానికి సంకేతం. కేంద్ర పెట్రోలియంశాఖా సహాయమంత్రి శ్రీమతి పనబాక లక్ష్మి, రాజ్యసభసభ్యులు యం.వెంకయ్యనాయుడు, నెల్లూరు పార్లమెంటుసభ్యులు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, కావలి శాసనసభ్యులు బీద మస్తాన్‌రావు, మాజీఎమ్మెల్యే బి.వి.సాయికృష్ణ యాచేంద్ర, షార్ మాజీడైరెక్టర్ పద్మశ్రీ కె.నారాయణ, బీజేపీ నాయకులు వేణుగోపాలరెడ్డి, కర్నాటి ఆంజనేయరెడ్డి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, బెగెరో అవార్డు కమిటి ఉపాధ్యక్షులు కొండా బలరామిరెడ్డి, కార్యదర్శి బి.వి.నరసింహం వేదికను అలంకరించారు. సతీష్‌రెడ్డి దేశమే గర్వించదగ్గ శాస్త్రవేత్తగా ఎదగాలని, భారతదేశానికి శాస్త్రసాంకేతిక సలహాదారుడుగా అవతరించాలని యం.వెంకయ్యనాయుడు ఆకాంక్షించారు. నా ముందు పుట్టి, నా ముందు తిరిగి, నా ముందు పెరిగిన సతీష్‌రెడ్డి స్వయంకృషితో ఇంతవాడు కావడం చూస్తుంటే ఎంతో గర్వకారణంగా వుందన్నారు. కేంద్రమంత్రి పనబాక లక్ష్మి మాట్లాడుతూ నేటి యువత సతీష్‌రెడ్డిని ఆదర్శంగా తీసుకుని దేశంకోసం పనిచేయాలన్నారు. సన్మానగ్రహీత సతీష్‌రెడ్డి మాట్లాడుతూ 1980వరకు మన దేశానికి ఒక్క క్షిపణి కూడా లేదని, ఈరోజు క్షిపణిల ప్రయోగంలో అగ్రదేశాల సరసన నిలిచామని అన్నారు. శత్రుదేశాల క్షిపణులు ధ్వంసం చేయగల అత్యాధునిక క్షిపణులు కలిగిన మొదటి నాలుగుదేశాలలో భారత్ వుందని, సముద్రగర్భంలో నుండి సైతం క్షిపణులు వదలగల సామర్థ్యం మన దేశానికి వుందని ఆయన పేర్కొన్నారు. చిన్ననాటి స్నేహితులు, చదువుచెప్పిన గురువులు, తాను చిన్నప్పటినుండి చూసిన రాజకీయ పెద్దల మధ్య ఈ సన్మానం అం... దం ఎంతో ఆనందాన్ని కలిగిస్తుందన్నారు. ఈ అభినందనసభకు మేధావులు, విద్యావేత్తలు పెద్దసంఖ్యలో హాజరు కావడం విశేషం!

# ఆనంకు ఆత్మీయ అభినందన



వివేకాను సత్కరిస్తున్న మాగుంట లేఅవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ కార్యవర్గసభ్యులు

పూర్తి ఆరోగ్యవంతుడై రెట్టించిన ఉత్సాహంతో నెల్లూరు నగరంలో అభివృద్ధి పనులు చేపడుతున్న నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డిని మాగుంట లేఅవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ ఈ నెల 22వ తేదీన ఘనంగా సత్కరించింది. మాగుంట లేఅవుట్‌లోని వాణీమహల్‌లో నిర్వహించిన ఈ అభినందన కార్యక్రమానికి స్థానికులు పెద్దసంఖ్యలో విచ్చేసారు. ఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డితో పాటు మాజీమేయర్ భానుశ్రీ, యువజన నాయకులు ఏ.సి.సుబ్బారెడ్డి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నెల్లూరు నగరపాలకసంస్థకు ఆదాయాన్నిచ్చి, అక్కడి సిబ్బందికి జీతాలిచ్చేది మాగుంట లేఅవుట్ వంటి ప్రాంతాలవారు కడుతున్న పన్నులతోనేనని, ఇలాంటి ప్రాంతాలను అభివృద్ధి చేయడం తమ బాధ్యతగా భావిస్తామని ఈ సందర్భంగా వివేకా చెప్పారు. ఈ ప్రాంతంలో మొదట త్రాగునీరు, డ్రైనేజీపై దృష్టి సారించి ఆ పనులు పూర్తి చేయడం జరిగిందని, ఈ ప్రాంతంలో వున్న రోడ్లన్నింటిని అభివృద్ధి చేస్తామన్నారు. వచ్చే కార్పొరేషన్ ఎన్నికలలో అందరికీ పనిచేసే అభ్యర్థినే ఇక్కడ నిలబెడతామని, వారిని గెలిపించి ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేయాలని ఆయన పిలుపునిచ్చారు.

మాగుంట లేఅవుట్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ మాగుంట లేఅవుట్‌లో ఇంకా పూర్తి చేయాల్సిన పనులెన్నో వున్నాయని, వాటిని పూర్తి చేసేందుకు సహకరించాలని ఆనం వివేకాను కోరారు. ఇంకా ఈ కార్యక్రమంలో రెసిడెంట్స్ అసోసియేషన్ గౌరవసలహాదారు ముప్పా బలరామయ్యనాయుడు, ప్రధాన కార్యదర్శి కనుపూరు శ్రీనివాసులురెడ్డి, ఇతర అసోసియేషన్ సభ్యులతో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# నింగిని చీల్చేందుకు పీఎస్ఎల్‌వి-సి22 సిద్ధం

అంతరిక్ష ప్రయోగాలలో భారత విజయాలకు వేదికగా నిలుస్తున్న శ్రీహరికోటలోని సతీష్‌ధావన్ అంతరిక్ష ప్రయోగ కేంద్రం(షార్ సెంటర్) నుండి నింగిలోకి దూసుకుపోయేందుకు మరో రాకెట్ సిద్ధంగా వుంది. జూలై 1వ తేదీ రాత్రి 11.41నిముషాలకు పీఎస్ఎల్‌వి-సి22ను మొదటి లాంచ్‌ప్యాడ్ నుండి ప్రయోగించనున్నారు. గత కొన్నేళ్లకాలంలో ఇంత రాత్రివేళ రాకెట్ ప్రయోగం జరపడం ఇప్పుడే కావడం గమనార్హం. ఈ రాకెట్ ద్వారా వాహనచోదకులకు మార్గాలను తెలిపే తొలి స్వదేశీ నావిగేషన్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెడతారు. 1422 కిలోల బరువుగల ఉపగ్రహాన్ని రాకెట్‌లో ఇప్పటికే అమర్చారు. 6 స్ట్రాపాన్ మోటార్లతో నాలుగు దశలలో 20.41 నిముషాలలో ఈ రాకెట్ ప్రయోగం పూర్తవుతుంది. రాకెట్ ప్రయోగాన్ని దృష్టిలో పెట్టుకుని సిఐఎస్ఎఫ్, పోలీసు దళాలు భారీబందోబస్తు ఏర్పాటు చేస్తున్నాయి.




Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.